


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :72 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 19 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం: విజయసాయిరెడ్డి



2లో

- సీమ ప్రాంత అభివృద్ధికి ప్రతిరూపంగా కొత్త పార్టీ రాబోతోందన్న విజయసాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యతనిచ్చాయని విమర్శ
- యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి రతనాలసీమగా మారుస్తానని హామీ

## బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



2లో

మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్ కు కేటీఆర్ సవాల్

హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి

కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు



2లో

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంఓయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

## విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం



2లో

- అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ హబ్.. రూ.2,700 కోట్లతో సృష్టి క్వాంటం సంస్థ
- లోకేశ్ ప్రత్యేక చొరవ... ఏపీకి ఐటీ, క్వాంటం కంపెనీల క్యూ.. వేల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషితో ఏపీకి తరలివస్తున్న టెక్ కంపెనీలు
- రూ.526 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

# విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ

- విశాఖకు ఐటీ కళ.. చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ కీలక నిర్ణయాలు
- రూ.526.25 కోట్ల విలువైన 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- విశాఖలో భారీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల మిగతా 2 లో



2లో

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి

పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి

ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి

50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం

పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం

ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు

ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని

# దశాబ్దాల నిరీక్షణకు తెర.. విశాఖలో 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు

### సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ

- సెప్టెంబర్ 19న పట్టాల పంపిణీ
- 11 మండలాల్లో భూముల క్రమబద్ధీకరణ
- 19.33 లక్షల చదరపు గజాల స్థలాలు
- పట్టాతో కుటుంబాలకు ఆస్తి భద్రతన్న చంద్రబాబు



అమరావతి: దశాబ్దాలుగా సొంత ఇంటిపై హక్కు కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాలకు పట్టాలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సెప్టెంబర్ 19న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో మిగతా 2 లో

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలి

### వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది

తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది

పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలి

రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలి



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ,



2లో

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం.. సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

- చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ

# ఎల్‌నినో నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం

### తర్వాత కరవు నివారణ చర్యల్లో చేసింది సున్నా

- రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కాదు, మ్యాన్ మేడ్ కరవు నెలకొంది
- జూన్ నుంచి వరుస నెలల్లో లోటు వర్షపాతం ఉంటే కరవు మండలాలను ఇప్పటి వరకూ ఎందుకు ప్రకటించలేదు



అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కాదు, మ్యాన్ మేడ్ కరవు నెలకొందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎల్‌నినోతో కరవు పరిస్థితులు నెలకొంటాయని ఫిబ్రవరి 4నే

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



2లో

- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య

# విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, ఫ్యూచర్ టెక్నాలజీ కంపెనీలు భారీ ఎత్తున తరలివస్తున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఈ భేటీలో రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 8,896 ఉద్యోగాలు కల్పించే 10 కీలక ఐటీ ప్రాజెక్టులకు, అలాగే క్వాంటం టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించగల పలు ప్రాజెక్టులకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో విశాఖపట్నం మరోసారి ఐటీ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. తాజాగా జరిగిన రాఖ్రాదీ భేటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డెలాయిట్, విశాఖలో రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది. అదేవిధంగా, ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో వైజాగ్‌లో "ఇంటిగ్రేటెడ్ హబ్ ఏఐ ఽ టెక్ ట్రైనింగ్ సెంటర్"ను నెలకొల్పనుంది. ఈ కేంద్రం ద్వారా 2,400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు, రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ఇందులో భాగంగా సృష్టి క్వాంటం ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటం కంప్యూటింగ్ హార్డ్‌వేర్, నానోఫ్యాబ్రికేషన్ తయారీ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే దాదాపు 3,000 ఉద్యోగాలు రానున్నాయి. వీటితో పాటు క్వాంటం కోడాన్, అరోహాక్ టెక్నాలజీస్, ట్రైక్వాంటా లాబ్స్, ఫోటాన్‌కోర్ సిస్టమ్స్, వెరిడేటా హెల్త్ వంటి సంస్థలు కూడా అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ కంపెనీల రాకతో క్వాంటం ఏఐ, డ్రగ్ డిస్కవరీ, ఫోటోనిక్స్ క్వాంటం రీసెర్చ్ వంటి అత్యాధునిక రంగాల్లో రాష్ట్ర యువతకు ఉజ్వల అవకాశాలు లభించనున్నాయి.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు ప్రోత్సాహకాల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తాజా నిర్ణయాలతో విశాఖపట్నం, అమరావతి, కడప వంటి ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. లోకేశ్ నాయకత్వంలో ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం
## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

హైదరాబాద్: సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

హైదరాబాద్: సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

## బెంగాల్ ఉపపోరు: మమత వర్గం పార్టీకి
## 'ఫుట్‌బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'

బెంగాల్ : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్' గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తాజాగా ఈ కేటాయింపులు చేసింది.

## విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా
## మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (రాఖ్రాదీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి రూ.526.25 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టులన్నీ ప్రధానంగా విశాఖపట్నం కేంద్రంగా రానుండటంతో, నగరం త్వరలో గ్లోబల్ టెక్ హబ్‌గా మారనుంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో దిగ్గజ ఐటీ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, దీని ఫలితంగానే తాజా పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో రెండు భారీ సంస్థలు విశాఖలో తమ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్, రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అదేవిధంగా, ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (రూ×) కార్యకలాపాల కోసం 2,400 సీట్లతో మరో భారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ రెండు కంపెనీల రాకతోనే దాదాపు 5,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. మొత్తం 10 ఐటీ ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలపగా, వీటిలో 7 ప్రాజెక్టులు అత్యాధునికమైన క్వాంటం టెక్నాలజీకి సంబంధించినవి కావడం విశేషం. ఈ నిర్ణయాలతో విశాఖపట్నం ఐటీ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, యువతకు భారీ ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..
## రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## దశాబ్దాల నిరీక్షణకు తెర.. విశాఖలో
## 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు

అమరావతి: దశాబ్దాలుగా సొంత ఇంటిపై హక్కు కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాలకు పట్టాలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సెప్టెంబర్ 19న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించనున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించి పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 11 మండలాల పరిధిలో 19,33,853 చదరపు గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదని.. ఇళ్లపై కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించే కీలక ఘట్టమని చంద్రబాబు అన్నారు. పట్టా ద్వారా కుటుంబాలకు ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ హక్కు లభిస్తాయని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో ఏళ్లుగా హక్కుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఊరట లభించనుంది. సెప్టెంబర్ 19న విశాఖలో చంద్రబాబు లబ్ధిదారులకు పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేస్తూనే సామాన్య కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం
### విజయసాయిరెడ్డి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు.

## బీఆర్ఎస్ నాయకులను
## టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..
## సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..
## ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్



ఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి..
## 15 మంది మృతి



ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు. పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో
## కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలి



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. ౹ాపీఖ్+ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రి గారికి ముఖ్యమంత్రి గారు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి గారిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

## ఎల్‌నినో నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం



అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కాదు, మ్యాన్ మేడ్ కరవు నెలకొందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎల్‌నినోతో కరవు పరిస్థితులు నెలకొంటాయని ఫిబ్రవరి 4నే చెప్పిన చంద్రబాబు.. తర్వాత కరవు నివారణ చర్యల్లో చేసింది సున్నా అని ఆరోపించారు. జూన్ నుంచి వరుస నెలల్లో లోటు వర్షపాతం ఉంటే కరవు మండలాలను ఇప్పటి వరకూ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'నీళ్లిస్తున్నాం సాగు చేసుకోండని జులై 11న సీఎం, ఆయన మంత్రులు చెప్పడం వల్ల రైతులు సాగు ప్రారంభించారు. 56.4 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. 2023 ఖరీఫ్ పంట బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన రూ1,400 కోట్లను 2024 జూన్‌లో చంద్రబాబు కట్టి ఉంటే రైతులకు సుమారు రూ.3 వేల కోట్ల మేలు జరిగేది. కానీ కట్టలేదు' అని పేర్కొన్నారు.

పోలవరంలో రాజీపడ్డారు

'పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తు వరకు అయితేనే 194 టీఎంసీల నీటిని నిల్వ చేయగలరు. దాన్ని కేంద్రం 41.15 మీటర్లకు కుదిస్తే చంద్రబాబు రాజీపడ్డారు. ఫలితంగా 120 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాన్ని, ఈ ప్రాజెక్టుకు కేంద్రం భరించాల్సిన రూ.60 వేల కోట్లలో సుమారు రూ.30 వేల కోట్లను వదులుకున్నారు. పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకువెళ్లి పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చినట్లు చంద్రబాబు డ్రామా చేశారు' అని జగన్ విమర్శించారు. కరవు మండలాలను వెంటనే ప్రకటించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై
## పూర్తి ఆధారాలు ఉన్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

## గణనాధునికి నిమ్మగడ్డ పురుషోత్తం శిరీష ప్రత్యేక పూజలు

-కరెన్సీ నోట్లతో గణనాధునికి అలంకరణ





ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాల తూర్పువైపు రామాలయం వద్ద గణనాధుని నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుండుపాలెం వాత్సవ్యులు నిమ్మగడ్డ పురుషోత్తం, శిరీష దంపతులు పూజా కార్యక్రమం నిర్వహచారు. ముందుగా గణనాథుని కరెన్సీ నోట్లతో అలంకరించారు. నిర్వాహకులు వేమూరి ప్రవీణ్ ఇతర గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ఉత్సవం గత 8 సం"ల నుండి పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఆదివారం నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. అదే రోజు స్వామి వారి అన్న సమాధానం జరుగుతుందని, ఈ అన్న ప్రసాదం ప్రతి ఒక్కరూ స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు...

## ఖాతాదారుల నమ్మకం చూరగొన్న జీవిత భీమా సంస్థ

-పది నిముషాల్లో జీవిత భీమా డెత్ క్లెయిమ్

-డాక్యుమెంట్స్ ఇచ్చిన పది నిముషాల్లో నామినీ ఖాతాకు రూ.3లక్షలు జమ



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :భీమా రంగంలో ఖాతాదారుల నమ్మకం చూరగొని తిరుగులేని విజేతగా నిలిచింది. కొత్తవ్యాపారం చేయటం మాత్రమే కాకుండా క్లెయిమ్స్ పరిష్కారం లోనూ అత్యంత వేగంగా స్పందించి ప్రజల మన్ననలు అందుకుంటోంది. అవనిగడ్డ జీవిత బీమా కార్యాలయంలో శుక్రవారం పది నిముషాల్లో క్లెయిమ్ పరిష్కరించి నామినీ ఖాతాలో రూ 3 లక్షల నగదును జమ చేశారు. మండల పరిధిలోని కొడాలి గ్రామానికి చెందిన తుమ్మల జనార్ధనరావు(బాబు) డెత్ క్లెయిమ్ కు సంబంధించిన పత్రాలను ఎండిఆర్టీ ఏజెంట్ దిషోన్ కుమార్ క్లెయిమ్స్ విభాగంలో అందచేశారు. వెంటనే స్పందించిన అధికారులు ఎం.లావణ్య, బి.మౌనిక, ఎ.రాంబాబులు సంబందిత పత్రాలను పరిశీలించి పది నిముషాల్లో క్లెయిమ్ సెటిల్ చేస్తూ రూ.3లక్షల మొత్తాన్ని నామినీ ఖాతాకు పంపారు. వృత్తిపట్ల అంకితభావం, పాలసీదారుల కుటుంబ ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా అత్యంత వేగంగా స్పందించి క్లెయిమ్ పరిష్కరించటం పట్ల బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ అధికారులను అభినందించారు. ఎల్ఐసి పట్ల ప్రజల్లో నమ్మకం మరింత పెరిగే ఈ తరహా విధినిర్వహణ అభినందనీయమన్నారు.

## రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి

-చిట్టూర్పులో సామూహిక ఎలుకల నిర్మూలన



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :ఘంటసాల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో వారం సామూహిక ఎలుకల నిర్మూలన నిర్వహించారు. చిట్టూర్పు గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. శ్యామల మాట్లాడుతూ, ఎలుకల వల్ల పంటలకు సుమారు 10 నుంచి 40 శాతం వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు . వరి పంటలో ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి డి. అనూష మాట్లాడుతూ, ఎలుకల నివారణకు రైతులందరూ సమష్టిగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎకరానికి నాలుగు గ్రాముల చొప్పున బ్రోమాడియోలోన్ మందును ఉపయోగించి విషపు ఎరను తయారు చేయాలన్నారు . 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2 గ్రాముల బ్రోమాడియోలోన్ మందు, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె కలిపి తయారు చేసి, ఒక్కో సజీవ బొరియకు 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి బొరియలో వేయాలని సూచించారు. సొసైటీ ప్రెసిడెంట్ గుత్తికొండ వరప్రసాద్, వి.ఏ.ఏ. సుబ్రహ్మణ్యేశ్వరి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ సౌజన్యంతో ఎంపీ బాలశౌరి పుట్టినరోజు వేడుకలు

- కోమల నగర్ ఎస్టీ కాలనీలో బాలశౌరి జన్మదిన వేడుకలు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ సౌజన్యంతో మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తోట కనకదుర్గ ఆధ్వర్యంలో కోమలా నగర్ లోని ఎస్టీ కాలనీలో ఘనంగా ఏర్పాటు చేశారు. బాలశౌరి పేరిట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కనకదుర్గతో పాటు జనసేన పార్టీ సీనియర్ నేతలు కోసూరు శివాజీ, అనుమకొండ పూర్ణ చంద్రశేఖర్ లు కట్ చేసి. ఎస్టి కాలనీ వాసులకు జనసేన పార్టీ నేతలు కేకును పంచిపెట్టారు. 80 మందికి పైగా ఎస్టీ లకు ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ సహకారంతో భోజనం ప్యాకెట్లను జన సైనికులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ మోపిదేవి మండల అధ్యక్షులు పూషడపు రత్న గోపాల్, మాజీ ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, దివి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేరకనపల్లి నరేష్, బుల్లా కిషోర్, బాదర్ల లోలాక్షుడు నాయుడు, మడమల రంజిత్ కుమార్, తోట రాజశేఖర్, గోవాడ రాము, గంగిశెట్టి బాబు రాజేంద్ర, యార్ల శ్రీకాంత్, యక్కటి రామాంజనేయులు, కూరేటి రాఘవేంద్రరావు, మేకల పవన్, మాతూరి వెంకటసుబ్బారావు, పసుపులేటి తేజ, కోసూరు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి ఉండాలి - ఎస్ఐ వేమన చందన.

-చట్టాలపై అవగాహన కలిగి భావితరాలకు నిర్దేశకులుగా విద్యార్థినిలు ఎదగాలి



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాల కెవికె నందు మహిళలకు చట్టాలపై ఘంటసాల కె వి కే సమన్వయకర్త డా. డి. సుధారాణి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విధ్యార్థులు చట్టాలపై అవగాహన తెచ్చుకొని భావి తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్.ఐ. వేమన చందన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి తమపై జరిగే వేధింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు, సమస్యల పై భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలన్నారు.. సైబర్ వేధింపులు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలన్నారు. కెవికె శాస్త్రవేత్తల బృందం, భోధన, భోధనేతర సిబ్బంది బాపట్ల వ్యవసాయ కళాశాల విధ్యార్ధీనులు పాల్గొన్నారు.

# సీనియర్ 'దేశం' నాయకుడు చారుగుండ్ల 138 రోజుల అమెరికా ఆధ్యాత్మిక పర్యటన

పలు దేవాలయాలు, నయాగర జలపాతం అందాలు (ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు)










చికాగో, న్యూయార్క్ అమెరికా శ్రీ వార్త ప్రతినిధి అమెరికాలో తెలుగువారి దేవాలయాలకు కొదవ లేదని, విదేశాలలో ఉన్న మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జీవించవచ్చని ప్రముఖ వ్యాపార వేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చారుగుండ్ల వెంకట హనుమంత రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విజయవాడ ఎన్టీఆర్. జిల్లా తిరువూరు పట్టణానికి చెందిన చారుగుండ్ల వెంకట హనుమంత రావు ఆయన సతీమణి రాధా కుమారి మొత్తం 138 రోజులు అమెరికా చికాగో ఆధ్యాత్మిక పర్యటన నిర్వహించారు. చికాగోలో సెయింట్ లూయిస్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవీ మాత, శ్రీ అయ్యప్ప స్వామి, శివాలయం సందర్శించి పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా అమెరికా అందాలను వీక్షించారు. గేట్ వే ఆర్చ్, శ్రీ స్వామి నారాయణ టెంపుల్ దర్శించారు. అమెరికాలో న్యూయార్క్ కెనడాల మధ్య " నయాగరా జల పాతం అందాలను వీక్షించారు. ఈ జలపాతం గుర్రపునడా ఆకారంలో ఉంది. నయాగరా జల పాతం న్యూయార్క్ లోని బఫెలోకు వాయువ్యంగా 27 కి.మీ. మరియూ టోరంటోకు ఆగ్నేయంగా 69 కి.మీ. దూరంలో ఒంటరియోలోని నయాగరా జల పాతం జంట నగరాల మధ్య ఉంది. అనంతరం న్యూయార్క్ దర్శించి ఆర్కాన్స్ స్టేట్ లో బెంటన్ వెల్ చేరుకొని ' సిల్వర్ డాలర్ సిట్, తల్సా తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ ఆధ్యాత్మిక పర్యటన తన కుటుంబ సభ్యులకు మంచి ఆనందాన్నిచ్చిందని చారుగుండ్ల వెంకట హనుమంత రావు వివరించారు. వీరి ఆధ్యాత్మిక పర్యటన విజయవంతంగా ముగిసినందుకు ఆయన మిత్రుడు సీనియర్ పాత్రికేయులు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో హేమంత్‌ను పరామర్శించిన తాడికొండ చిన్న

-హేమంత్ కుటుంబానికి ధైర్యం చెప్పిన చిన్న



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన కోడూరు హేమంత్ పాముకాటుకు గురై చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి హేమంత్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి హేమంత్ ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ల

## తెర వెనుక తమాషా' నాటక పుస్తకావిష్కరణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్రచయిత భవిష్య రచించిన "తెర వెనుక తమాషా" నాటక పుస్తకావిష్కరణ భావ తరంగిణి ఆధ్వర్యాన మచిలీపట్నం వివేకానంద మందిరంలో శు క్రవారం ఘనంగా జరిగింది.సభకు అధ్యక్షత వహించిన ప్రపంచ రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ భవిష్య రాసిన నాటకాలు జనరంజకంగా, సందేశాత్మకంగా ఉంటాయన్నారు.గౌరవ అతిథులుగా పాల్గొన్న సాహితీవేత్తలు డా. బి. ధన్వంతరి ఆచార్య, డా. చింతలపాటి మురళీకృష్ణ మాట్లాడుతూ నాటకాలకు ఇప్పటికీ మంచి ఆదరణ ఉందని, ఆనాటి నాటకాలు చిరస్మరణీయంగా నిలిచాయన్నారు.విశిష్ట అతిథులు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ డిప్యూటీ చీఫ్ మేనేజర్ (కమర్షియల్) టి. పెద్దిరాజు, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపే చైతన్య కిరణం నాటకం అన్నారు.పుస్తకాన్ని సమీక్షిస్తూ ప్రముఖ రచయిత్రి గుడిపూడి రాధికారాణి మాట్లాడుతూ, ఒక నాటకం ప్రదర్శన వెనుక ఉన్న బాధలను, నేటి నటుల వ్యవహార శైలిని వాస్తవాలతో పాటు హాస్యం పండించేలా రచయిత రాశారన్నారు.కవి మేడిశెట్టి యోగేశ్వరరావు మాట్లాడుతూ, అభినయ, నివేదన, చీకటి వెనుక వెలుగు, తెర వెనుక తమాషా నాటకాలన్నీ గొప్ప సందేశాత్మకంగా ఉన్నాయని, హాస్యంతో జనరంజకంగా సాగిస్తూ సందేశం ఇవ్వడం భవిష్య ప్రత్యేకత అన్నారు.కార్యక్రమంలో రచయిత్రి గురజాడ రాజేశ్వరి, త్యాగరాజ సంగీత విద్యాపీఠం ప్రతినిధులు సింగరాజు కళ్యాణి, కాళీపట్నపు ఉమ, నాగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లంకిశెట్టి నీరజ జ్యోతి ప్రజ్వలన చేశారు. నాటక రచయిత భవిష్య, సాహిత్య అభిమాని పీఎస్ఎస్ఆర్ శర్మ, నటులు అద్దేపల్లి ప్రసాద్, వై. శ్రీరామ్, రావినూతల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఈశ్వర్ రావు పాల్గొన్నారు. గాయని శిరీష స్వాగతం పలికారు.

## ఘనంగా బేబీ వినుత మొదటి పుట్టినరోజు వేడుకలు ప్రేమ, దైవభక్తి, మంచి విలువలతో పిల్లలను పెంచాలి

కాల్వరీ మిషన్ చర్చి రెవ. పాస్టర్ జాన్ స్వరాజ్




కర్ణాటక శ్రీ వార్త న్యూస్ కేశవ్ ట్రావెల్స్ అధినేత చెన్నకేశవులు, రీటా దంపతుల కుమార్తె బేబీ వినుత మొదటి పుట్టినరోజు వేడుకలు కర్ణాటక స్టేట్ హుబ్లీ నగరం లోని రైల్వే ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై చిన్నారి వినుతకు పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా బేబీ వినీత తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ వేడుకకు నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా), న్యూఢిల్లీ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ ,జేఎస్ గ్రూప్ సీఈఓ బడే జీవన్ తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాల్వరీ మిషన్ చర్చి రెవ. పాస్టర్ జాన్ స్వరాజ్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ప్రేమ, క్రమశిక్షణ, దైవభక్తి, ప్రార్థన, మంచి విలువలు, సరైన మార్గదర్శకత్వంతో పిల్లలను పెంచాలని సూచించారు. పిల్లలను ప్రభువు మార్గంలో నడిపించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం ప్రార్థనలు, ఆశీస్సుల మధ్య బేబీ వినుత పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. పాటలు, ఆత్మీయ కలయికలు, ఆనందోత్సాహాల మధ్య వేడుకలు కొనసాగాయి. అనంతరం నిర్వహించిన విందుతో కార్యక్రమం ఆత్మీయంగా, ఆనందంగా ముగిసింది.




## మెహ్రామ్ కేటగిరీ కింద ఐదు వందల (500) హజ్ సీట్ల కేటాయింపు

: ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ జనాబ్ షేక్ హసన్ భాష



విజయవాడ, సెప్టెంబర్ 18, శ్రీ వార్త న్యూస్::హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, హజ్ పాలసీ--2027లో పేర్కొన్న విధంగా మెహ్రామ్ కేటగిరీ కింద ఐదు వందల (500) హజ్ సీట్ల కేటాయింపు కోసం అర్హత కలిగిన హజ్ చేయదలచిన మహిళా యాత్రికుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ జనాబ్ షేక్ హసన్ భాష తెలిపారు. సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ ఈ ప్రత్యేక నిబంధన ద్వారా, పాస్‌పోర్ట్ అందుబాటులో లేకపోవడం లేదా ఇతర నిజమైన కారణాల వల్ల హజ్--2027 కోసం ఇంతకుముందు దరఖాస్తు చేసుకోలేకపోయిన మహిళా అభ్యర్థులకు, వారి పురుష సహచరులు (మెహ్రామ్) విజయవంతంగా దరఖాస్తు చేసి ఎంపికైన సందర్భంలో, అవకాశం కల్పించడం ఉద్దేశ్యం.3. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో 23.09.2026 నుండి 07.10.2026 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు సౌకర్యం అందుబాటులో ఉంటుంది.4. మెహ్రామ్ కేటగిరీ కింద దరఖాస్తుకు అర్హతలు:అ. మహిళా దరఖాస్తుదారు గతంలో హజ్ చేసి ఉండకూడదు --- హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా గానీ, హజ్ గ్రూప్ ఆర్గనైజర్స్ (ఎ+టూం) ద్వారా గానీ, ఇతర ఏ విధంగానైనా గానీ. అలాగే, ఆమె హజ్--2027కు నిర్దేశించిన అన్ని ఇతర ప్రమాణాలను కూడా పూర్తి చేయాలి.ఆఅ. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే, అధికారిక వెబ్‌సైట్‌ద్వారా సమర్పించాలి. హార్డ్ కాపీలు, చేతిరాత లేదా టైప్ చేసిన దరఖాస్తులు స్వీకరించబడవు.అఅఅ. దరఖాస్తుదారు చెల్లుబాటు అయ్యే మెషీన్-రీడబుల్ భారతీయ అంతర్జాతీయ పాస్‌పోర్ట్ కలిగి ఉండాలి. అది ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ నాటికి జారీ అయి ఉండాలి మరియు 31.12.2027 వరకు కనీసం చెల్లుబాటులో ఉండాలి.అజ. దరఖాస్తుదారులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్‌లోని మొదటి మరియు చివరి పేజీలను, ఇటీవలి పాస్‌పోర్ట్ సైజు ఫోటోను, చిరునామా రుజువును, అలాగే ఆమె మెహ్రామ్‌తో ఉన్న సంబంధాన్ని నిర్ధారించే చెల్లుబాటు అయ్యే పత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. అవసరమైన పత్రాలలో ఏదైనా లేని దరఖాస్తులు తిరస్కరించబడతాయి.జ. ఒక కవర్‌లో గరిష్ఠంగా ఐదు (5) మంది యాత్రికులు ఉండవచ్చు. కాబట్టి, ఇప్పటికే ఐదు (5) మంది యాత్రికులు ఉన్న కవర్‌లో మహిళా యాత్రికురాలు ఈ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హురాలు కాదు.జఅ. ఇప్పటికే హజ్--2027కు దరఖాస్తు చేసుకుని, వారి కవర్లు జనరేట్ అయిన హజ్ చేయదలచిన యాత్రికులు ఈ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు.5. సీట్ల లభ్యతకు లోబడి, దరఖాస్తులను అర్హత/మెరిట్ ప్రాతిపదికన పరిశీలిస్తారు. అర్హత కలిగిన దరఖాస్తుల సంఖ్య అందుబాటులో ఉన్న కోటా కంటే ఎక్కువగా ఉంటే, సీట్ల కేటాయింపు కోసం డిజిటల్ ర్యాండమ్ సెలెక్షన్ (ఖుర్రా/కుర్రా) నిర్వహించబడుతుంది.

## విక్కుర్తి జయలక్ష్మి ని సన్మానిస్తున్న భక్త బృందం శ్రీ లక్ష్మీ గణపతి సన్నిధిలో విక్కుర్తి ప్రత్యేక పూజలు



అవనిగడ్డ సెప్టెంబర్ 18 శ్రీ వార్త ఒకటవ వార్డులోని విక్కుర్తి వీర రాఘవయ్య వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సతీమణి విక్కుర్తి జయలక్ష్మి హాజరై శ్రీ లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పామర్రులో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహణ



ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు శ్రీ వార్త న్యూస్ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు.పామర్రు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో శుక్రవారం పామర్రులో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.పామర్రు ఎస్కేఆర్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఆరేపల్లి కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుగా విన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.పామర్రు నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజాపామర్రు నియోజకవర్గ శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి సత్వర పరిష్కారం చూపించడమే మీ కోసం కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నాలుగు వారాలుగా పామర్రు నియోజకవర్గాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరై పెండింగ్‌లో ఉన్న, క్లిష్టమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు.'విజన్ పామర్రు'లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి వివిధ శాఖలు, స్థానిక సంస్థల నిధులను సమన్వయం చేస్తున్నామని తెలిపారు. రాబోయే దసరా, సంక్రాంతిలోపు 'పల్లె పండుగ--3.0' ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి సుమారు రూ.7 కోట్లు, శ్రీవాణి పథకం కింద 11 ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజలకు సుమారు రూ.14 కోట్ల ఆర్థిక సహాయం అందించామని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, డీఎస్పీ పాల శ్రీనివాసరావు, పామర్రు, పెదపారుపూడి, పమిడిముక్కల, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల తహసిల్దార్లు రవికాంత్, శ్రీను నాయక్, నవీన్ కుమార్, కే మస్తాన్, కుసుమకుమారి సంబంధిత శాఖల అధికారులు, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పంటల రక్షణకే 'సామూహిక ఎలుకల నిర్మూలన'

### గోడ పత్రికలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి ఆవిష్కరించిన కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



పామర్రు శ్రీ వార్త న్యూస్ :పంట కాలంలో ఎలుకల ఉధృతి వల్ల రైతులకు జరిగే నష్టాన్ని నివారించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న "సామూహిక ఎలుకల నిర్మూలన" ప్రచార గోడ పత్రికలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తో కలిసి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పామర్రు నిర్వహించిన పి జె ఆర్ ఎస్ కార్యక్రమంలో శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగు నీటి కాల్వలు, పంట పొలాల్లో ఏకకాలంలో గ్రామాల్లోని రైతులంతా కలిసి సామూహికంగా ఎలుకల నివారణ మందులు పెట్టాలని పిలుపునిచ్చారు. తద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ గోడ పత్రికలను అన్ని గ్రామ సచివాలయాలు, రైతు సేవ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు కే జ్యోతి రమణి, పామర్రు ఏ డి ఏ స్వర్ణలత, మండల వ్యవసాయ శాఖ అధికారిని వి శివ నాగరాణి, ఇతర జిల్లా డివిజన్ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ్ అభియాన్ మాసోత్సవాలు



పమంటాడ ,శ్రీ వార్త న్యూస్ పామరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం సెక్టర్ లోని మంటాడ అంగన్‌వాడీ-3 కేంద్రంలో జాతీయ పోషణ్ అభియాన్ వేడుకలు గురువారం సందడిగా జరిగాయి. కేంద్ర నిర్వాహకురాలు ఎస్. రాజేశ్వరి నేతృత్వంలో గర్భిణీలు, బాలింతలకు లభించే పోషకాలపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో కూడిన స్థానిక ఆహార పదార్థాల ద్వారానే శరీరానికి అవసరమైన పూర్తి విటమిన్లు లభిస్తాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని కోరారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు అంగనవాడి హెల్పర్లు పాల్గొన్నారు

## పుట్టగొడుగుల సాగుపై మహిళలకు శిక్షణ కార్యక్రమం



పామర్రు శ్రీ వార్త న్యూస్ ఉద్యాన శాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల వారి సాంకేతిక సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు పుట్టగొడుగుల పెంపకం మరియు స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. జ్యోతి మాట్లాడుతూ, పుట్టగొడుగులు అధిక పోషక విలువలు కలిగిన ఆరోగ్యకరమైన ఆహారమని, వీటిని నిత్యాహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని కూడా పెంపొందించుకోవచ్చని తెలిపారు. మహిళలు పుట్టగొడుగుల సాగును స్వయం ఉపాధి సాధనంగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశమున్న ఈ పరిశ్రమకు మార్కెటింగ్ పరంగా మంచి అవకాశాలు ఉన్నాయని, రెసిలియెంట్ అగ్రి టెక్ ఫార్మ్ ద్వారా కొనుగోలు ఒప్పందం సదుపాయం కల్పించబడుతోందని వివరించారు.అలాగే ఉద్యాన శాఖ అమలు చేస్తున్న సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా పుట్టగొడుగుల ఉత్పత్తి యూనిట్ల స్థాపనకు 40 నుండి 50 శాతం వరకు సబ్సిడీ అందజేయబడుతోందని తెలిపారు. శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మహిళలు ఈ రంగంలో స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మరియు డైరెక్టర్ డా. సుధారాణి మాట్లాడుతూ, పుట్టగొడుగుల సాగు గ్రామీణ మహిళలకు ఉత్తమ స్వయం ఉపాధి అవకాశమని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధిని విస్తరించుకోవాలని సూచించారు. కల్తీ లేని, అధిక పోషక విలువలు కలిగిన ఆహారంగా పుట్టగొడుగులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు.గృహ విజ్ఞాన శాస్త్రం ఇన్‌చార్జి శాస్త్రవేత్త మరియు సస్యరక్షణ విభాగం సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ డా. కె. రేవతి, పుట్టగొడుగుల సాగుకు అవసరమైన ముడి పదార్థాల ఎంపిక, బెడ్ తయారీ, స్పానింగ్, నిర్వహణ, పంట కోత, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్యాకింగ్ మరియు మార్కెటింగ్ వరకు పూర్తి స్థాయిలో సాంకేతిక శిక్షణ అందించారు.జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. హరిహరనాథ్ మాట్లాడుతూ, పుట్టగొడుగుల సాగు మహిళలకు తక్కువ పెట్టుబడితో ప్రారంభించగల లాభదాయక స్వయం ఉపాధి పరిశ్రమ అని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, ప్రభుత్వ సహాయ పథకాల గురించి వివరించి, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డివిజనల్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ మధు, పామర్రు ఉద్యాన అధికారి జె. కీర్తి దేవ్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ తిరుపతయ్య, రెసిలియెంట్ అగ్రి టెక్ వ్యవస్థాపకులు ఆర్.వి.ఎల్. మనోహర్, శ్రీమతి డి. సాయి సుధ, సీసీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు ఆసక్తి గల మహిళలు పాల్గొన్నారు.

# సీనియర్ 'దేశం' నాయకుడు చారుగుండ్ల 138 రోజుల అమెరికా ఆధ్యాత్మిక పర్యటన

పలు దేవాలయాలు, నయాగర జలపాతం అందాలు (ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు)










చికాగో, న్యూయార్క్ అమెరికా శ్రీ వార్త ప్రతినిధి అమెరికాలో తెలుగువారి దేవాలయాలకు కొదవ లేదని, విదేశాలలో ఉన్న మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జీవించవచ్చని ప్రముఖ వ్యాపార వేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చారుగుండ్ల వెంకట హనుమంత రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విజయవాడ ఎన్టీఆర్. జిల్లా తిరువూరు పట్టణానికి చెందిన చారుగుండ్ల వెంకట హనుమంత రావు ఆయన సతీమణి రాధా కుమారి మొత్తం 138 రోజులు అమెరికా చికాగో ఆధ్యాత్మిక పర్యటన నిర్వహించారు. చికాగోలో సెయింట్ లూయిస్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవీ మాత, శ్రీ అయ్యప్ప స్వామి, శివాలయం సందర్శించి పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా అమెరికా అందాలను వీక్షించారు. గేట్ వే ఆర్చ్, శ్రీ స్వామి నారాయణ టెంపుల్ దర్శించారు. అమెరికాలో న్యూయార్క్ కెనడాల మధ్య " నయాగరా జల పాతం అందాలను వీక్షించారు. ఈ జలపాతం గుర్రపునడా ఆకారంలో ఉంది. నయాగరా జల పాతం న్యూయార్క్ లోని బఫెలోకు వాయువ్యంగా 27 కి.మీ. మరియూ టోరంటోకు ఆగ్నేయంగా 69 కి.మీ. దూరంలో ఒంటరియోలోని నయాగరా జల పాతం జంట నగరాల మధ్య ఉంది. అనంతరం న్యూయార్క్ దర్శించి ఆర్కాన్స్ స్టేట్ లో బెంటన్ వెల్ చేరుకొని ' సిల్వర్ డాలర్ సిటీ, తల్సా తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ ఆధ్యాత్మిక పర్యటన తన కుటుంబ సభ్యులకు మంచి ఆనందాన్నిచ్చిందని చారుగుండ్ల వెంకట హనుమంత రావు వివరించారు. వీరి ఆధ్యాత్మిక పర్యటన విజయవంతంగా ముగిసినందుకు ఆయన మిత్రుడు సీనియర్ పాత్రికేయులు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆకస్మిక తనిఖీ

వైద్య సేవలు, రికార్డుల నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలన





గూడూరు శ్రీ వార్త న్యూస్ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శుక్రవారం గూడూరు మండలం, మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తరకటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఓపీ రిజిస్టర్, రిఫరల్ రిజిస్టర్, డ్రగ్ రిజిస్టర్, ఎన్‌సీడీ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఎంఎల్‌హెచ్‌పీని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వారి ఆరోగ్య పరిస్థితిపై నిరంతర ఫాలోఅప్, సంబంధిత వివరాల నమోదు ప్రక్రియపై ఏఎన్ఎంను ఆరా తీశారు.ఆశా కార్యకర్తలతో మాట్లాడిన కలెక్టర్, తమ పరిధిలోని ఏఎన్‌సీ, లెప్రసీ, టీబీ, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు సంబంధించిన వ్యక్తుల వివరాలను తప్పనిసరిగా రికార్డుల రూపంలో నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రాథమిక స్థాయిలోనే సమర్థవంతమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.ఎల్. దయాకర్, మల్లవోలు మెడికల్ ఆఫీసర్ డా. తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన తెలుపుతున్న గ్రామ సేవకులు వీఆర్‌ఏ లకు పే స్కేలు అమలు చేయాలి



అవనిగడ్డ సెప్టెంబర్ 18 శ్రీ వార్త గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 15వ తేదీ నుండి సామూహిక నిరాకరణ సమ్మె చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది ఈ పిలుపులో భాగంగా మూడవ రోజు శుక్రవారం జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం ప్రధాన కార్యదర్శి రమేష్ ల ఆధ్వర్యంలో మా సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెబాట చేపట్టామని అధ్యక్షులు దోవారి ముసలయ్య సెక్రటరీ మునిపల్లి నాగేశ్వరావులు నిరసన తెలుపుతూ మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని నామిని గా పనిచేస్తున్న వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని కారుణ్య నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ నుండి వీఆర్వో గా ప్రమోషన్ ఇవ్వాలని జీవో నెంబర్ 13 ప్రకారం సీనియార్టీ ప్రకారం ఇంటర్ క్వాలిఫికేషన్ తో ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు . అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు నిర్వహిస్తున్న దీక్షకు కార్యాలయ సిబ్బందితోపాటు ఎలక్షన్ డిటి అవనిగడ్డ శ్రీనివాసరావు వీఆర్ఏలకు వీఆర్వోలు సంఘీభావం తెలిపారు. గ్రామాల్లో వీఆర్ఏల పాత్ర కీలకమైనదని వారు సమాచారం ఇవ్వకుంటే సమగ్ర దర్యాప్తు జరగదని అందువలన వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో అర్థం చేసుకొని వారికి రోజుకి 600 రూపాయలు చొప్పున నెలకు 18 వేల రూపాయలు జీతం అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వాసంతి. చంద్ర.వీఆర్ఏ లు అయినంపూడి శుభవాని జోష్ణ తో పాటు పలువురు గ్రామ సేవకులు పాల్గొన్నారు.

## డీజీపీ హరీష్‌కుమార్ ను అభినందిస్తున్న విక్కుర్తి

### బిజెపి హరీష్ కుమార్ గుప్తాను కలిసిన విక్కుర్తి



అవనిగడ్డ సెప్టెంబర్ 18 శ్రీ వార్త ఇటీవలే నూతనంగా అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్కుర్తి శ్రీనివాసరావు శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, విక్కుర్తి శ్రీనివాసరావు కి టీడీపీ ఇంచార్జ్ వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో శాంతిభద్రతలు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తున్న డీజీపీ కి ఈ సందర్భంగా అభినందనలు తెలియచేశారు. విక్కుర్తి శ్రీనివాసరావు డీజీపీతో ఆత్మీయంగా ముచ్చటించారు.

## మచిలీపట్నం సిటీ కేబుల్ కార్యాలయంల రూ. 6 లక్షల రూపాయల అలంకరణతో వినాయకుడు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌మచిలీపట్నం సిటీ కేబుల్ కార్యాలయ ఆవరణలో రూ. ఆరు లక్షల రూపాయల విలువైన ప్రత్యేక అలంకరణతో వినాయకుని అలంకరణ సిటీ కేబుల్ అధినేత కొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే సిటీ కేబుల్ సంస్థ ఈ ఏడాది మరింత వైభవంగా ఏర్పాట్లు చేసింది. కార్యాలయ ఆవరణ మొత్తం విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణ, ప్రత్యేక మండపంతో కళకళలాడుతోంది.

# ఐనంపూడిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి నిర్మాణ పనులు పరిశీలన



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా పామర్రు మండలం ఐనంపూడిలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శుక్రవారం పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఐనంపూడిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు మొత్తం 10 ఎకరాల భూమి కేటాయించగా, అందులో 6.62 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తొలిదశలో సుమారు 2 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామని, ఇందులో 26 షెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో షెడ్డు సుమారు 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని వివరించారు.చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్థానిక ఔత్సాహికులు తమ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ఈ షెడ్లను లీజు ప్రాతిపదికన ప్లగ్ అండ్ ప్లే విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన అప్రోచ్ రహదారి కోసం కొంత భూసేకరణ చేపట్టాల్సి ఉందని, అది పూర్తయితే కాంప్లెక్స్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావచ్చని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల్లో ఐనంపూడి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కూడా భాగమని అధికారులు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ద్వారా స్థానికంగా చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లకు ప్రోత్సాహం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాంప్లెక్స్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, మౌలిక వసతులు, అప్రోచ్ రహదారి తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డీఓ ఎస్ కరుణ కుమారి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



# పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం..

ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల విభజనపై విద్యార్థులకు విస్తృత అవగాహన..

మండల విద్యాశాఖ అధికారి ఎల్ సత్యనారాయణ.






పోలవరం, సెప్టెంబర్ 18)పోలవరం మండలం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి ఎల్ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం'స్వచ్ఛతా హి సేవా -2026' కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం మరియు వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగాస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ జి. ప్రసంగి రాజు పాల్గొని ప్రసంగించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026 పై ఆయన మాట్లాడుతూ వ్యర్థాల వేరుచేసే విధానంలో "అబ్ దో నహీ, చార్" విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. తడి, పొడి, ప్రమాదకరమైన మరియు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం ద్వారా మాత్రమే పర్యావరణాన్ని కాపాడుకోగలమని వివరించారు.మండల వైద్యశాఖ అధికారి ఎల్. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతను అలవర్చుకోవాలని, పాఠశాలలో పారిశుధ్యం, వర్షపు నీటి సంరక్షణ మరియు నీటి పొదుపుపై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఓ రవి కుమార్ పర్యావరణ పరిరక్షణ మరియు స్వచ్ఛత ఆవశ్యకతపై ప్రసంగించారు. తొలుత అతిథులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులందరూ కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్ని ప్రజలు గుర్తించాలి : ప్రత్తిపాటి

కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు.. అభివృద్ధికి ప్రాముఖ్యత ఇస్తోంది.

పలు వార్డుల్లో రూ48 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజ్ లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.



చిలకలూరిపేట : సెప్టెంబర్ జిల్లా ప్రతినిధి:-చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్ని ప్రజలు గుర్తించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 25,27, 29 వార్డుల్లో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి మూడువార్డుల్లో రూ.48 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజ్ లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధచిలకలూరిపేట పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, త్వరలోనే రూ.52 కోట్లతో ప్రజలకు అవసరమైన వివిధ రకాల అభివృద్ధి పనుల్ని



ప్రారంభించబోతున్నామని ప్రత్తిపాటి చెప్పారు. రోడ్లు, డ్రైనేజ్ లు, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యం, పార్కుల సుందరీకరణ పనులకు అదిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు.. అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందని, పట్టణాలు, గ్రామాల ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. 25 వ వార్డులో రూ.11 లక్షలు, 27వ వార్డులో రూ.22 లక్షలు, 29వ వార్డులో రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజ్ ల పనులకు నేడు శంకుస్థాపన చేశామని, త్వరలోనే ఆ పనులన్నీ పూర్తై ప్రజలకు కొత్త రోడ్లు, డ్రైనేజ్ లు అందుబాటులోకి వస్తాయని ప్రత్తిపాటి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు షేక్ మస్తాన్ వలి, వహాబ్, నందం చంద్ర, మాధవ్ సింగ్, పూర్ణ సింగ్, దామర్ల రవి, అనితా భాయి, వనిత భాయి, మానేపల్లి సుధాకర్, సింగం సాయి, అమీర్ భాష, మహేష్, షేక్ కరిముల్లా, బేరింగ్ మౌలాలి, తోట బ్రాహ్మస్వాములు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంపౌండర్, నర్సుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాను.డేగల ప్రభాకర్



చిలకలూరిపేట : సెప్టెంబర్ 18(),జిల్లా ప్రతినిధి:-ఆంధ్రప్రదేశ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ కాంపౌండర్, నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు కలిశారు. అయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో 5 లక్షల పైచిలుకు కాంపౌండర్, నర్సులుగా పనిచేయడం జరుగుతుందని చాలీ,చాలని జీతాలతో బ్రతుకుతున్నామని చాలామందికి ఉంటానికి నివాసం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరోనా లాంటి విపత్తు సమయంలో కాంపౌండర్లు, నర్సులు ప్రాణాలకు సైతం తెగించి సేవ చేశారని ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి ఆదుకోవాలని అన్నారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కచ్చితంగా మీ కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలను పరిష్కరించే దిశగా నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒంగోలు లక్ష్మణాచారి, ఎండి మొహిద్దిన్, శ్రీను, కిరణ్, నాగరాజు, శివ మరికొందరు సభ్యులు పాల్గొన్నారు..

# ఆర్ వై ఎస్ ఎఫ్ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయండి.

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన డీఈవో యన్. ప్రేమ్ కుమార్.




విశాఖపట్నం సెప్టెంబర్ -18 జిల్లా ఇంచార్జ్.సెప్టెంబర్ 23, 24 తేదీలలో విశాఖపట్నం లో జరుగుతున్న రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్ ఫోరమ్ ఆర్ వై ఎస్ ఎఫ్ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ప్లీనరీ సమావేశాలు జయప్రదం కావాలని జిల్లా విద్యా శాఖ అధికారి( డీఈవో ) యన్. ప్రేమ్ కుమార్ ఆకాక్షించారు.విశాఖ పట్నం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఇఓ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు లాంటి అమరవీరుల పోరాట స్ఫూర్తితో విద్యార్థులు యువత ఎదుర్కొంటున్నటువంటి సమస్యల మీద పోరాటాలు నిర్వహించడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న రైట్స్ ఫర్ యూత్ స్టూడెంట్స్ ఫోరం ఆర్ వై ఎస్ ఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ సమావేశాలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఆర్ వై ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, చామల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వెనుకబడినటువంటి ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని నూతన పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 22 23 తేదీలలో జరిగేటటువంటి ఉత్తరాంధ్ర జిల్లాల క్లీనరీ సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి చేపట్టవలసినటువంటి కార్యక్రమాలు పై చర్చించి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజలు తెలియచేసే సమస్యల పరిష్కారంలో ఏ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి వీల్లేదు : ప్రత్తిపాటి

జనావాసాల మధ్య మద్యం దుకాణాల్ని అనుమతించకండి.

ప్రజలకు ఇబ్బంది కలిగే చర్యల్ని కూటమి ప్రభుత్వం సమర్థించదు.

ఫిర్యాదు చేసే వరకు సమస్యను గుర్తించరా..?

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) లో ప్రత్తిపాటి అసహనం.



చిలకలూరిపేట : సెప్టెంబర్ 18,జిల్లా ప్రతినిధి:-జనావాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఎలా అనుమతించారని, తక్షణమే దుకాణం అక్కడి నుంచి తొలగించి, మరోచోట దూరంగా ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగే చర్యల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన కొందరు తాము నివాసముండే గృహాల సమీపంలో మరో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, కొత్తగా పెట్టిన దానివల్లే తాము ఇబ్బందులు పడుతున్నామని వారు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్తిపాటి. వెంటనే ఫోన్ ద్వారా ఎక్సైజ్, పోలీస్ అధికారులతో మాట్లాడారు. మద్యం దుకాణం జనావాసాల్లో ఏర్పాటు చేయడమేంటని వారిని ప్రశ్నించారు. మహిళలు చిన్నారులు ఇబ్బంది పడే వరకు స్పందించరా అన్న ప్రత్తిపాటి.. సదరు దుకాణాన్ని దూరంగా మరోచోట ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకుల్ని ఒప్పించాలని అధికారులకు సూచించారు. గణపవరంలో ఉన్న మద్యం దుకాణాల్ని పరిశీలించి, స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటికి గణపవరం గ్రామస్తులు తమ కృతజ్ఞతలు తెలియచేశారు.

**ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది.**

ప్రజలు తెలియచేసే సమస్యల పరిష్కారంలో ఏ విభాగం నిర్లక్ష్యంగాఆ వ్యవహరించడానికి వీల్లేదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, శ్రద్ధతో పనిచేయడమే ముఖ్యమని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టం చేశారు. 'ప్రజలు వస్తారు..అర్జీలు ఇస్తారు..వెళతారు.. మన పని మనం చేసుకుందాం' అనే నిర్లక్ష్య ధోరణి ఎవరికీ మంచిది కాదని, పద్ధతులు, విధానాలు మార్చుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం సాగర తీరంలో వైభవంగా 5వ రోజు 63 అడుగుల మహా గణపతి ఉత్సవాలు





మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నం సాగర తీరంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్న 63 అడుగుల మహా గణపతి మహోత్సవాలు 5వ రోజుకు చేరుకున్నాయి. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.ఐదవ రోజు సందర్భంగా 63 అడుగుల మహా గణపతికి వేద పండితులచే విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ప్రతి ఒక్క భక్తుడికి దర్శనం కల్పించేలా ఉత్సవ సమితి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ఈ సందర్భంగా గుడివాడ ప్రణవ ఆశ్రమ పీఠాధిపతులు స్థైర్యానంద సరస్వతీ స్వామీజీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు స్వామీజీకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.పూజా కార్యక్రమాల అనంతరం స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. గణపతి ఆరాధన వల్ల విఘ్నాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని, భక్తి శ్రద్ధలతో చేసే పూజకు తప్పక ఫలితం ఉంటుందని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.సాగర తీర మహా గణపతి మహోత్సవాలు రోజురోజుకూ భక్తజన సందోహంతో మరింత శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చలమలశెట్టి నరసింహారావు, కొమరాగిరి చంద్రశేఖర్, వేమూరి బాలు, ప్రసాద్, గోపీచంద్ పీ వీ ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు అండగా నిలిచిన నాయకుడు చంద్రబాబే : ప్రత్తిపాటి

దివ్యాంగుల పింఛన్ ను

రూ.3 నుంచి రూ.6వేలకు పెంచింది చంద్రబాబే.

వైకల్యం.. అనారోగ్యాన్ని బట్టి రూ.15వేల వరకు అందిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా వారి

సంక్షేమంలో ముఖ్యమంత్రి రాజీ పడటం లేదు

రూ.13 లక్షల విలువైన 10 ట్రై స్కూటీల్ని పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రత్తిపాటి, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల.



చిలకలూరిపేట : సెప్టెంబర్ 18,జిల్లా ప్రతినిధి:-దివ్యాంగుల సంక్షేమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నడూ రాజీ పడలేదని, 2014-19 మధ్య వారికి అన్నివిధాల అండగా నిలిచారని, కూటమి పాలనలోనూ వారిని ఆదుకోవడంలో ఉదారంగా వ్యవహరిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలియచేశారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేటలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.13 లక్షల విలువైన 10 ట్రై స్కూటీలను దివ్యాంగులకు అందచేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు బాలరాజు అప్పయ్యతో కలిసి ట్రై స్కూటీలు పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**ఉపాధి అవకాశాలు కల్పనలోనూ చంద్రబాబు విశేష కృషి చేశారు..**

రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా.. దివ్యాంగుల సంక్షేమంలో చంద్రబాబు ముందే ఉంటున్నారని, దివ్యాంగుల పింఛన్ ను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచిన ఘనత ఆయనదేనని ప్రత్తిపాటి చెప్పారు. దివ్యాంగులకు విద్య, ఉపాధి, ఆరోగ్య సేవల్ని అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వారికి ఆర్థిక భద్రతతో పాటు.. పలు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ చంద్రబాబు విశేష కృషి చేశారని ప్రత్తిపాటి తెలిపారు. దివ్యాంగ శక్త పథకం ద్వారా దివ్యాంగులకు వారి సహాయకులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారన్నారు. సాధరణ ప్రజలతో పాటు దివ్యాంగుల్ని మోసగించిన నాయకుడిగా జగన్ నిలిచారని, వారికిచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా ఆయన నెరవేర్చలేదని ప్రత్తిపాటి తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగులు అన్ని విధాల నష్టపోయారన్నారు.

**కూటమి విజయమే దివ్యాంగుల ప్రధాన లక్ష్యం : గోనుగుంట్ల**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ దివ్యాంగుల పక్షపాతే అని, 2014-19లో ఆయన విభిన్న ప్రతిభావంతులకోసం పలు పథకాలు ప్రవేశపెట్టారని, కూటమిప్రభుత్వంలోనూ వారికి ఎంతో మేలు చేశారని ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులందరం పట్టుదలగా పనిచేసి కూటమి అభ్యర్థుల్ని గెలిపిస్తామని, వారి విజయమే లక్ష్యంగా ఇప్పటినుంచే పనిచేస్తామని గోనుగుంట్ల స్పష్టంచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు బాలరాజు, అప్పయ్య, ఎస్.ఎస్ సుభాని, మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, అమర రమాదేవి,

అప్పారావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక

శనివారం - 19 - సెప్టెంబర్ - 2026

# ఏఐ ఏజెంట్లతో షాపింగ్.. మాస్టర్ కార్డ్ ఏజెంటిక్ కామర్స్ విప్లవం!



కృత్రిమ మేధ(ఏఐ) కేవలం సమాధానాలు ఇచ్చే స్థాయి నుంచి మన తరఫున పనులు పూర్తి చేసే ఏజెంటిక్ స్థాయికి చేరుకుంది. ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వేదికగా మాస్టర్ కార్డ్ తన వినూత్న ఏజెంటిక్ కామర్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించింది. కేవలం వస్తువులను సిఫార్సు చేయడమే కాకుండా వినియోగదారుడి అవసరాలను గుర్తించి బేరసారాలు ఆడి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేసే సామర్థ్యం దీని సొంతం. ఈ సందర్భంగా మాస్టర్ కార్డ్ ఏఐ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నితేంద్ర రాజ్‌పుత్ కొన్ని అంశాలు వెల్లడించారు.

## స్థానిక భాషల్లో ఆర్థిక లావాదేవీలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా మాస్టర్ కార్డ్ తన ఏజెంటిక్ వ్యవస్థను రూపొందించింది. కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారులకు సైతం ఏఐ ప్రయోజనాలను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ వ్యవస్థలో వినియోగదారుడు మొదటగా తనకిష్టమైన భాషను ఎంచుకోవచ్చు. వాయిస్ సపోర్ట్‌తో కూడిన ఈ టెక్నాలజీ వివిధ భారతీయ భాషల్లో సంభాషించగలదు. భారతీయ నిబంధనలకు అనుగుణంగా డేటా స్థానికీకరణ , గోప్యత, భారతీయ ఆర్థిక చట్టాలకు లోబడి ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్మించినట్లు కంపెనీ తెలిపింది. 'మేము భారతదేశంలో దశాబ్దాలుగా సర్వీసులు అందిస్తున్నాం. ఇక్కడి డేటా నిబంధనల ఆధారంగానే మా ఏజెంటిక్ కామర్స్ ఏర్పాటు చేశాం' అని రాజ్‌పుత్ స్పష్టం చేశారు.

## సాధారణ ఈ-కామర్స్ ఎం ఏజెంటిక్ కామర్స్

సాధారణ ఈ-కామర్స్‌లో మీరు ఒక వెబ్‌సైట్‌కి వెళ్లి వస్తువులను వెతికి, ధరలను పోల్చి, మీరే ఆర్డర్ చేస్తారు. ఇక్కడ ఏఐ కేవలం 'మీకు ఫలానా వస్తువులు నచ్చవచ్చు' అని సిఫార్సులు మాత్రమే చేస్తుంది. ఏజెంటిక్ కామర్స్‌లో ఒక ఏఐ ఏజెంట్ ఉంటుంది. మీరు దానికి ఒక పని చెబితే (ఉదాహరణకు: వచ్చే వారం మా నాన్నగారి పుట్టినరోజు కోసం రూ.5000 బడ్జెట్‌లో ఒక మంచి వాచ్ కొనాలి), అది స్వయంగా ఇంటర్నెట్‌లో వెతుకుతుంది. రివ్యూలు చదువుతుంది. ఉత్తమమైన ధర ఎక్కడ ఉంటుందో తెలుసుకుంటుంది. చివరగా మీ అనుమతితో లావాదేవీని పూర్తి చేస్తుంది.

## మోసాలకు తావులేని ఆటోమేషన్

ఏఐ ఏజెంట్లు స్వయంగా ఖర్చు చేస్తాయంటే భద్రతపై ఆందోళన కలగడం సహజం. దీన్ని అరికట్టడానికి మాస్టర్ కార్డ్ టోకెనైజేషన్, పాస్ కీ వంటి అధునాతన భద్రతా ప్రమాణాలను ప్రవేశపెట్టింది. ఏజెంట్ లావాదేవీ చేయాలంటే వినియోగదారుడి అనుమతి తప్పనిసరి. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి కంపెనీ తన ప్లాట్‌ఫామ్‌ను మరింత బలోపేతం చేసింది. ఇది వినియోగదారుడి గత చరిత్రను విశ్లేషించి అసాధారణ మార్పులను వెంటనే గుర్తిస్తుంది. గ్రాఫ్ ఆధారిత సాంకేతికత ద్వారా సింథటిక్ ఐడెంటిటీలు, అంతర్జాతీయ మోసగాళ్ల నెట్‌వర్క్‌లను పసిగట్టడం మాస్టర్ కార్డ్ ప్రత్యేకతని కంపెనీ తెలిపింది.

## ఉద్యోగాల కోత కాదు..

ఏజెంటిక్ ఏఐ రాకతో ఫిన్‌టెక్ రంగంలో ఉద్యోగాలపై ప్రభావం గురించి అడిగిన ప్రశ్నకు రాజ్‌పుత్ స్పందిస్తూ 'కచ్చితంగా ఉద్యోగాల స్వరూపంలో మార్పు ఉంటుంది. అయితే ఉద్యోగాల కోత కంటే వివిధ జాబ్ రోల్స్‌పై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది' అని విశ్లేషించారు. మెకానికల్ పనులను ఏఐ చూసుకుంటే మానవులు మరింత సృజనాత్మక, వ్యూహాత్మక పనుల వైపు మళ్లాలని సూచించారు.

# ఏఐ యుగం.. సముద్రంలో కేబుళ్లు కాపాడుకోవడమే కీలకం



న్యూఢిల్లీ: ఏఐ యుగంలో డిజిటల్ లక్ష్యాల సాధనకు సముద్ర అంతర్భాగంలో (సబ్ సీ) వేసే కేబుల్ నెట్‌వర్క్ కీలకమైందని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లాహోటి తెలిపారు. అయితే, ప్రకృతి విపత్తులు, భౌగోళిక--రాజకీయ ఉద్రిక్తతలు, డేటాకి డిమాండ్ మొదలైన వాటి వల్ల తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందుకుసంబంధించిన సవాళ్లను పరిష్కరించేందుకు సాంకేతిక ఆవిష్కరణలు, నిర్వహణపరమైన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, విధానాల పరమైన చర్యల్లాంటి బహుముఖ వ్యూహం అవసరమని పేర్కొన్నారు. కేబుల్స్ వేసే మార్గాల ప్లానింగ్, రిస్కులు తక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకోవడం, రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లను వినియోగించడంలాంటి అంశాలతో నష్టాలను నివారించవచ్చని బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా లాహోటి చెప్పారు. సబ్‌మెరీన్ కేబుల్ వ్యవస్థ భద్రతను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సహకారం, పటిష్టమైన నియంత్రణ విధానాలు అవసరమన్నారు. సబ్ సీ కేబుల్, డిజిటల్ క్లౌడ్ మౌలిక సదుపాయాలు డిజిటల్ ప్రపంచానికి, ఏఐ యుగానికి కీలకమైన ఇన్‌ఫ్రాగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో క్లౌడ్ మౌలిక సదుపాయాలకు సంబంధించి పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ చర్యలు, నిరంతరం పొంచి ఉన్న ముప్పులను పర్యవేక్షించడం కీలకమని ఆయన పేర్కొన్నారు.

## రికార్డు స్థాయిలో డేటా వినియోగం..

దేశీయంగా డిజిటల్ వినియోగం చాలా వేగంగా వృద్ధి చెందుతోందని, గత దశాబ్దకాలంలో బ్రాడ్‌బ్యాండ్ యూజర్ల సంఖ్య ఆరు రెట్లు ఎగిసిందని లాహోటి చెప్పారు. 2025 నవంబర్ నాటికి ఇది 100 కోట్ల మైలురాయిని అధిగమించిందని వివరించారు. కనెక్టివిటీ వల్ల డేటా వినియోగం రికార్డు స్థాయిలో పెరిగిందని, ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ యూజర్లు నెలకు సగటున 27 జీబీ మేర వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. 'డేటా వినియోగం, డిజిటలీకరణ, ఏఐ వృద్ధి మొదలైన వాటి వల్ల గ్లోబల్ డేటా సెంటర్ల మౌలిక సదుపాయాలకు, సబ్‌మెరైన్ కేబుల్ వ్యవస్థలకు డిమాండ్ పెరుగుతోంది' అని లాహోటి చెప్పారు.

# ఏఐతో ఐటీకి ఇబ్బందే...

### మార్పు ప్రక్రియ బాధాకరమే కానీ కంపెనీలు రూపాంతరం చెందక తప్పదు హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్



ముంబై: పెద్ద సంఖ్యలో ఉద్యోగులతో ముడిపడి ఉన్నందున కృత్రిమ మేధకు (ఏఐ) మారడం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమకు బాధాకరమైన ప్రక్రియగానే ఉంటుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ చెప్పారు. అయితే, గతంలో వై2కే సవాళ్లు వచ్చినప్పుడు దీటుగా ఎదుర్కొన్నట్లుగానే, పరిశ్రమ తిరిగి తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఇందుకు కావాల్సిన సామర్థ్యాలు పరిశ్రమకు ఉన్నాయని పేర్కొన్నారు. ఐటీ షేర్ల విషయంలో ఇన్వెస్టర్లు మరీ ఎక్కువగా ఆందోళన చెందుతున్నారన్నారు. ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ నిర్వహించిన టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరం సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. ఏఐ మోడల్స్ రాకతో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు టెక్ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం దేశీ ఐటీ రంగం కీలక దశలో ఉందని, వచ్చే 5--10 ఏళ్లలో పరిశ్రమ సరికొత్తగా రూపాంతరం చెందే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. కోడింగ్ విషయంలో ఆంత్రోపిక్ క్లాడ్ అత్యద్భుతంగా పని చేసినప్పటికీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కోడింగ్ వాటా 30 శాతమే ఉంటుంది కాబట్టి పరిశ్రమలో అవకాశాలు మెరుగ్గానే ఉండొచ్చన్నారు.

## ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్

రాబోయే రోజుల్లో ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుందని, దానికి తగ్గట్లుగా ఉద్యోగులు, ఉద్యోగార్థులు సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉంటుందని కుమార్ చెప్పారు. క్లయింట్లకు భారీగా బిల్లింగ్ వేస్తూ, గణనీయంగా వృద్ధి చెందిన సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్) కంపెనీలకు, ఇకపై అదే స్థాయిలో చార్జీలు విధించడం సాధ్యపడదు కాబట్టి అవి సవాళ్లు ఎదుర్కొనాల్సి రావొచ్చని పేర్కొన్నారు. పెట్టుబడులకు తగ్గ స్థాయిలో ఆదాయాలు వచ్చే అవకాశాలు లేనందున విస్తృత స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై భారీగా ఇన్వెస్ట్ చేసిన సంస్థలకు సమస్యలు ఎదురుకావొచ్చన్నారు.




# స్వదేశీ విశ్వరూపం.. సర్వం విజయం




ఢిల్లీ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సాక్షిగా 'సర్వం ఏఐ' సగర్వంగా చెప్పకనే చెప్పింది. 'వరల్డ్--క్లాస్ హార్డ్ టెక్నాలజీ ఇండియాలో కూడా సాధ్యమే' అని! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'సర్వం' విజయం ఆ కంపెనీ వ్యవస్థాపకుల సమర్థతకు మాత్రమే పరిమితమైన విజయం కాదు. 'మన దేశం--మన కంపెనీ' అని కలలు కనే ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్‌ల విజయం. 'మేధోవలస'కు చేయి అడ్డు పెట్టి...'ఎక్కడో ఎందుకు? మన దేశంలోనే అద్భుతాలు సృష్టించవచ్చు' అని ధైర్యాన్ని ఇచ్చే విజయం.... 'పీహెచ్‌డీలు ముఖ్యం కాదు. కంపెనీకి సరిగ్గా అవసరమైన వారే ముఖ్యం' అంటూ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా స్వదేశంలో ప్రయాణం మొదలుపెట్టిన వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్‌లు 'సర్వం ఏఐ'తో సత్తా చాటారు. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) నుంచి నిన్నా మొన్నటి 'సర్వం కేజ్' స్మార్ట్‌గ్లాసెస్ వరకు, ఏ.ఐ మోడల్స్ శిక్షణకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ మహిళల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం వరకు... సర్వం సాంకేతికమయం!

## సర్వం సక్సెస్ మంత్రా

ఒక స్టార్టప్ సక్సెస్ కావడానికి, సూపర్ సక్సెస్ కావడానికి ఏం ఉండాలి? 'సర్వం ఏఐ' ఫౌండర్‌లలో ఒకరైన వివేక్ రాఘవన్ మాటల్లో చె??పాలంటే 'ఏదైనా చేయగలననే నమ్మకం ఉండాలి' ఇండియా నుంచి వరల్డ్ క్లాస్ మోడల్స్‌ను నిర్మించాలనే లక్ష్యంతో బయలుదేరింది సర్వం. 'మా విజయం ఎలా ఉండాలంటే ఇతర డెవలపర్‌లు, స్టార్టప్‌లు కూడా యస్...మేము కూడా ప్రపంచంతో ?ోటీ పడుతూ వరల్డ్--క్లాస్ మోడల్స్‌ను నిర్మించగలం అనే నమ్మకాన్ని పాదుకొల్పేంతగా' అన్నారు వివేక్. 'వీరి ఆత్మవిశ్వాసం ఆకాశమంత ఎత్తులో కనిపిస్తుంది. సాధించగలరా?' అని కొందరికి సందేహం వచ్చింది. పగటి కలలకే పరిమితమై ఉంటే వారి కలలు కలలుగానే ఉండేవి. అయితే వారు రాత్రనకా, పగలనకా కష్టపడ్డారు.

## ఇది యువత విజయం

తొలి అడుగులు వేస్తున్నప్పుడు 'సర్వం' టీమ్‌లో ఉన్నది సాంకేతిక ఉద్దండులు కాదు. నవ యువకులు! 'వీరితో విజయం సాధ్యమా?' అని కూడా కొందరికి సందేహం వచ్చింది. 'కచ్చితంగా సాధ్యమే' అని నిరూపించింది సర్వం. అందుకే..."మా సంస్థ విజయాన్ని భారతదేశ యువత విజయంగా కూడా నేను భావిస్తున్నాను' అంటారు వివేక్. ఎంటర్‌ప్రెన్యూర్‌గా సిలికాన్ వ్యాలీలో గెలుపు జెండా ఎగరేసిన తరువాత స్వదేశీ బాట పట్టారు. రచ్చ గెలిచి ఇంట గెలవడానికి బయలుదేరారు.

## పీహెచ్‌డీ... పెద్ద విషయం కాదు!

'మీ ఇద్దరికీ పీహెచ్‌డీ ఉంది. సిలికాన్ వ్యాలీలో ఉన్నట్లు పీహెచ్‌డీ చేసిన డీప్--టెక్ వ్యవస్థాపకులు మన దేశంలో పెద్దగా కనిపించరు' అనే ప్రశ్నకు 'నిజమే!' అని కాలర్ ఎగరేయలేదు వివేక్. 'పీహెచ్‌డీ అనేది పెద్ద విషయం కాదు. సంస్థకు పనికొచ్చే సామర్థ్యమే ముఖ్యం. పీహెచ్‌డీ వరకు ఎందుకు? హైస్కూల్ స్థాయిలో కూడా అద్భుత ప్రతిభ చూపుతున్న విద్యార్థులను మనం చూస్తూనే ఉన్నాం. నాకు పీహెచ్‌డీ ఉన్నప్పటికీ దానిలో ప్రత్యేకంగా ఏమీ లేదని నేను అనుకుంటున్నాను. పీహెచ్‌డీలు చేసినవారు ఎంతోమంది ఉన్నారు. కంపెనీకి అవసరమైన సరైయెన వ్యక్తిని ఎంచుకోవడమే ముఖ్యం' అంటారు వివేక్. వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్‌లు వ్యవస్థాపనలో బెంగళూరు కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'సర్వం' 2023లో ప్రారంభమైంది. భారతీయ భాషలలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)ను అభివృద్ధి చేసింది. స్పీచ్--టు--టెక్స్ట్, విజన్--లాంగ్వేజ్ మోడల్స్‌లాంటి మల్టీ మోడల్స్‌ను, సిస్టమ్స్‌ను కూడా కంపెనీ డెవలప్ చేసింది. 'సర్వం విజన్' పేరుతో విజన్--లాంగ్వేజ్ మోడల్‌ని పరిచయం చేసింది. గత సంవత్సరం సర్వం ఏఐ 'ఇండియా ఏఐ మిషన్'కు ఎంపికైంది. డొమెస్టిక్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మోడల్ డెవలప్‌మెంట్‌కు ఈ మిషన్ స?ోర్ట్ చేస్తుంది. 'ఏఐ ఫర్ భారత్'తో పాటు లాంగ్వేజ్ డాటాబేస్, స్పీచ్ రిసెర్చ్‌కు సంబంధించి విద్యాసంస్థలతో కలిసి పనిచేసింది సర్వం.

## ఇద్దరూ ఇద్దరే

వివేక్ రాఘవన్ ఐఐటీ--దిల్లీ నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లోడిగ్రీ, కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. ఐఐటీ--బాంబే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన ప్రత్యూష్ కుమార్‌కు కంప్యూటర్ సైన్స్ పరిశోధనకు సంబంధించి పదిహేను సంవత్సరాల అనుభవం ఉంది. జ్యూరిచ్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. ఇద్దరు ప్రతిభావంతులు ఒక దగ్గర చేరితే అద్భుతాలు జరుగుతాయనేది నిజమే అయినా, ఆ ప్రతిభావంతులు తమలాంటి వారి కోసం అన్వేషించి, తమ జట్టులో చేర్చుకోవడమే అసలుసిసలు అద్భుతం.

## రిస్క్ తీసుకోక?ోవడమే పెద్ద రిస్క్!

సిలికాన్ వ్యాలీ తన ఆలోచన తీరును మార్చింది అంటారు వివేక్ రాఘవన్. 'మనల్ని మనం నిరూపించుకోవాలనుకుంటే కచ్చితంగా రిస్క్ తీసుకోవాలి' అనేది సిలికాన్ వ్యాలీ చెప్పిన పాఠం. 'ఇతరత్రా రిస్క్‌లతో ?ోల్చితే టెక్నాలజీ రిస్క్ అనేది భిన్నమైది' అనే విషయం తెలిసినా 'సై' అంటూ స్వదేశీ బాట పట్టారు వివేక్ రాఘవన్.

## నెట్ అవసరం లేదండీ!

'ఎడ్జ్' అనే కొత్త ఆన్--డివైజ్ ఏఐ మోడల్‌ను ఆవిష్కరించింది సర్వం ఏఐ. ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్‌లలో పనిచేసేలా దీన్ని రూపొందించారు. స్పీచ్ రికగ్నిషన్, ట్రాన్స్‌లేషన్, టెక్స్‌జి?ట--టు--స్పీచ్‌లాంటి పనులెన్నో చేస్తుంది. డివైజ్‌లోనే డాటా ప్రాసెస్ చేయబడినందున యూజర్‌లు సమాచారాన్ని క్లౌడ్‌కు పంపాల్సిన అవసరం లేదు. 'ఈ మోడల్ వేగం, గోప్యత, విశ్వసనీయతపై దృష్టి సారిస్తుందని, అదే సమయంలో ప్రధాన భారతీయ భాషలకు మద్దతు ఇస్తుంది' అని కంపెనీ ప్రకటించింది.

## ఇండస్

స్వదేశీ స్టార్టప్ సర్వం ఏఐ 'ఇండస్' అనే కొత్త ఏఐ చాట్‌బాట్ యాప్‌ను తీసుకువచ్చింది. 'భారతీయ వినియోగదారుల కోసం భారత్‌లో రూపొందించిన యాప్ ఇది' అని ప్రకటించింది కంపెనీ. చాట్‌జీపీటీ, జెమినివంటి ప్రసిద్ధ చాట్‌బాట్‌ల మాదిరిగానే 'ఇండస్'లో ఫీచర్‌లు ఉన్నాయి. యూజర్‌లు వాయిస్ కమాండ్‌లు ఇవ్వవచ్చు. ప్రశ్నలను టైప్ చేయడానికి బదులుగా మాట్లాడవచ్చు. ఏఐ వెబ్‌లో శోధించవచ్చు. స్పష్టమైన సమాధానాలను తెలుసుకోవచ్చు, లోతైన పరిశోధన చేయవచ్చు. నేరుగా యాప్‌లోనే డాక్యుమెంట్లు రాయవచ్చు. ఇమేజ్‌లు, పీడీఎఫ్‌లు, ఫైళ్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లోని మరో ప్రత్యేకత భాషా సౌలభ్యం.

# ఏఐతో ముప్పేమీ లేదు

### కొత్త టెక్నాలజీతో నైపుణ్యాలు పెరుగుతాయి మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్



కృత్రిమ మేధ (ఏఐ)తో టెక్ పరిశ్రమ ఉద్యోగాల్లో భారీగా కోత పడుతుందన్న ఆందోళనలను మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ తోసిపుచ్చారు. దీనివల్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఐటీ ప్రొఫెషనల్స్‌కి ముప్పేమీ లేదని, ఇది వారి స్థానాన్ని భర్తీ చేయదని చెప్పారు. వారు తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను మెరుగుపర్చుకునేందుకు ఏఐ సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు మరింత స్మార్ట్‌గా పని చేసుకునేందుకు తోడ్పడే టెక్నాలజీని రూపొందించడం మైక్రోసాఫ్ట్ లక్ష్యమని ఆయన చెప్పారు. పదే పదే పునరావృతమయ్యే కోడింగ్ పనులను మాత్రమే ఏఐ టేకోవర్ చేయొచ్చని, దీనితో ప్రోడక్ట్ డిజైన్, ఆర్కిటెక్చర్, టెస్టింగ్, భద్రత మొదలైన వాటిపై ఫోకస్ చేసేందుకు డెవలపర్లకు వీలు చిక్కుతుందని స్మిత్ తెలిపారు. ఉద్యోగాలను తగ్గించడం కాకుండా వాటిని మరింత ఆసక్తికరంగా మార్చేందుకు ఏఐ సహాయపడుతుందని చెప్పారు. దీనితో నిపుణులకు డిమాండ్ పెరుగుతుందని, వేతనాలు కూడా పెరుగుతాయని స్మిత్ వివరించారు. ప్రజల సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఉపయోగపడే టెక్నాలజీని, మెషిన్లను తయారు చేయడమే మైక్రోసాఫ్ట్ ప్రాథమిక లక్ష్యమని ఆయన చెప్పారు. సాంకేతికత అనేది ఉత్పాదకత, ఆర్థిక వృద్ధికి చోదకంగా ఉంటూనే అత్యంత నాణ్యమైన ఉద్యోగాల కల్పనకు దోహదపడే విధంగా ఉండాలని పేర్కొన్నారు.

# సీఎం సువెందు దెబ్బ మమతకు ఒకే రోజు రెండు షాకులు



కోల్‌కతా : అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి టీఎంసీ అధినేత మమతా బెనర్జీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. కీలకమైన నందిగ్రామ్ ఉపఎన్నికకు కేవలం నెల రోజులు ముందు మమతా బెనర్జీ శిబిరానికి చెందిన టీఎంసీ అభ్యర్థి అభ్యర్థి సంచిత ప్రధాన్ డే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోవడం కలకలం రేపింది. రాష్ట్ర సచివాలయం 'నబన్నా'లో ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన కొన్ని గంటల్లోనే ఆమె ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## కాంగ్రెస్‌కు మద్దతు అంటున్నమమతా

దీంతో అనివార్యంగా మమత కాంగ్రెస్‌కు మద్దతుప్రకటించాల్సి వచ్చింది. సంచిత ప్రధాన్ డే అభ్యర్థిత్వం ఉపసంహరణపై స్పందించిన మమతా బెనర్జీ, జుమ్లా పార్టీ అంటూ బీజేపీపై మండిపడ్డారు. తాము INDIA కూటమితో కలిసి నడుస్తున్నామని, నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని ఆమె ప్రకటించారు. సువేందు నందిగ్రామ్ సిట్టింగ్ ఎమ్మెల్యే కావడం, ఆయనను కలవడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని తొలుత వర్గాలు పేర్కొన్నప్పటికీ, రాజకీయ వర్గాలలో ఇది పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. రెజిన్‌గ్రామ్, నందిగ్రామ్ ఉపఎన్నికల కోసం ఎన్నికల సంఘం మమతా శిబిరానికి కొత్త గుర్తును కేటాయించిన రోజే సంచిత ప్రధాన్ డే తన తప్పుకుంటున్నట్లు ప్రకటించడం విశేషం.

## పార్టీ, గుర్తు రెండూ

మమత తన టీఎంసీ పార్టీ పేరు, గుర్తూ రెండు కోల్పోయారు. దీంతో గత 28 ఏళ్లుగా తమతో ఉన్న 'పువ్వులు, గడ్డి' (జోరా ఫూల్) ఎన్నికల గుర్తును, పార్టీ పేరును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. మమతా శిబిరానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును, రిబ్రతా బెనర్జీ నేతృత్వంలోని ప్రత్యర్థి శిబిరానికి 'కవర్ (ఎన్వలప్)' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు




విజయవాడ: మాజీమంత్రి అంబటి రాంబాబుపై కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆయనపై మరో కేసు మోపేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. తాజాగా ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 11వ తేదీనే విచారణకు హాజరు కావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు జారీ చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. అయితే, అంబటి రాంబాబు మాత్రం ఈడీ నుంచి తనకు ఎలాంటి నోటీసులు రాలేదని తెలిపారు. తాము ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం అందించామని, ఈ వ్యవహారంలో అంబటి రాంబాబు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈడీ విచారణకు సంబంధించి తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# హైకోర్టులో ఎదురు దెబ్బ.. దానం నాగేందర్ యూటర్న్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత వేటు వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ తీర్పు వెలువడిన వెంటనే దానం నాగేందర్ యూటర్న్ తీసుకున్నారు. తొలుత ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తానని చెప్పిన ఆయన, ఆ తర్వాత తన మనసు మార్చుకున్నారు. హైకోర్టు తీర్పుపై స్పందిస్తూ ఆయన మాట్లాడుతూ.. 'హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన నాకు లేదు. ఉప ఎన్నిక వస్తే మళ్లీ పోటీ చేస్తా. యుద్ధం నాకేం కొత్త కాదు. మళ్లీ పోరాడుతా.. మళ్లీ గెలుస్తా!' అని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక దాదాపు ఖాయమగడంతో, దానం నాగేందర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# 'ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడను'



గుంటూరు: రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులో ఈ నెల 20 తేదీన గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించనున్న సమావేశానికి ఏర్పాట్లను నియోజకవర్గ సమన్వయకర్తలు షేక్ నూరి ఫాతిమా, వనమా బాల వజ్రబాబు, మాజీ కార్పొరేటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కొత్తగా 76 వార్డులు ఉన్నాయి. రేపు సమష్టిగా పార్టీ శ్రేణులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఐక్యంగా రాబోయే ఎన్నికలకు వెళ్తున్నాం. ఈ రెండేళ్లలో చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వైఎస్ జగన్ సంక్షేమ కార్యక్రమాలతో ఈ కూటమి సర్కార్ పోటీ పడలేకపోతోంది. రాబోయే ఎన్నికల్లో అధికార దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోం. పోలీసులతో కట్టడి చేసే ప్రయత్నం చేస్తే సహించం" అంటూ అంబటి రాంబాబు తేల్చి చెప్పారు. దొంగ ఓట్లు ఉండటానికి వీల్లేదు. రాబోయే ఎన్నికల్లో ఒకరు ఒక ఓటు మాత్రమే వేయాలి. రెండో ఓటు వేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ పెడితే వేధించడమే పనిగా పెట్టుకున్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన నేను భయపడను. చెప్పాలి అనుకున్నది మేము ధైర్యంగా చెప్తాము. తండ్రి కొడుకులు వ్యవస్థలను నాశనం చేస్తున్నారు" అని అంబటి రాంబాబు దుయ్యబట్టారు.

# రష్యా ఆంక్షల బిల్లు.. చూశారా ట్రంప్ డబుల్ గేమ్!



రష్యాపై మరిన్ని ఆంక్షలకు అమెరికా సిద్ధమైంది. రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ టారిఫ్‌లు విధించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారం ఇచ్చే బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. దీంతో రష్యా చమురు కొనుగోలులో కీలకంగా ఉన్న భారత్, చైనాలకు 100 శాతం వరకు టారిఫ్ ముప్పు పొంచి ఉంది. అయితే.. ఇదే బిల్లులో అమెరికాకు అనుకూలంగా ఉన్న మరో కీలక నిబంధన ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ట్రంప్ సర్కార్ 'లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్--2026' పేరుతో ఈ బిల్లును తీసుకొచ్చింది. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు చమురు, గ్యాస్ ఎగుమతులే ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. ఆ ఆదాయాన్ని తగ్గించడంతో పాటు.. రష్యాతో ఇంధన వ్యాపారం కొనసాగిస్తున్న దేశాలపై ఒత్తిడి పెంచడమే బిల్లు ప్రధాన ఉద్దేశం. రష్యా అధికారులు(అధ్యక్షుడు పుతిన్ సహా..), ఆర్థిక సంస్థలు, ఇంధన రంగం, ఆంక్షలను తప్పించుకునేందుకు ఉపయోగిస్తున్న 'షాడో ఫ్లీట్'పై కూడా కఠిన చర్యలకు ఇందులో అవకాశం కల్పించారు. అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు 262--159 ఓట్లతో ఆమోదం పొందింది. ఇందులో 203 మంది రిపబ్లికన్లు, 58 మంది డెమొక్రాట్లు, ఒక ఇండిపెండెంట్ సభ్యుడు అనుకూలంగా ఓటేశారు. అంతకుముందే సెనేట్ కూడా ఈ బిల్లును 86--11 ఓట్లతో ఆమోదించింది. దీంతో ఇప్పుడు బిల్లు ట్రంప్ డెస్క్‌కు చేరగా.. ఆయన సంతకంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## అసలు ట్విస్ట్ ఇదే..

రష్యా నుంచి చమురు కొనే దేశాలపై భారీ టారిఫ్‌లకు సిద్ధమైన అమెరికా.. అందులో తనకు అనుకూలంగా ఓ సెక్షన్‌ను జత చేర్చుకుంది. అవసరమైన రష్యా యురేనియం విషయంలో మాత్రం కొంత వెసులుబాటు ఉంచుకుంది. అయితే బిల్లులోని సెక్షన్ 111 రష్యా నుంచి యురేనియం దిగుమతులపై ఇప్పటికే ఉన్న అమెరికా ఆంక్షలను అమలు చేయాలని చెబుతోంది. రష్యా ప్రభుత్వ అణు సంస్థ రోసాటమ్, దాని అనుబంధ/వారస సంస్థల నుంచి వచ్చే యురేనియం కూడా ఇందులో ప్రస్తావనకు వచ్చింది. కానీ అదే బిల్లులోని సెక్షన్ 114 మాత్రం కొన్ని ముఖ్యమైన మినహాయింపులను ఇచ్చింది. అమెరికా--రష్యా మధ్య కుదిరిన పౌర అణు సహకార ఒప్పందాల కింద జరిగే కొన్ని కార్యకలాపాలకు ఈ ఆంక్షలు వర్తించవు. అలాగే అణు రియాక్టర్లలో ఉపయోగించే కొన్ని రకాల లో-ఎన్‌రిచ్డ్ యురేనియం (ఎల్ఈయూ) దిగుమతులకు కూడా మినహాయింపు ఉంది. నిబంధనల ప్రకారం కొన్ని వైద్య ఐసోటోపుల దిగుమతులకు కూడా వెసులుబాటు కల్పించారు. అంటే రష్యాతో అణు రంగంలో ప్రతి లావాదేవీని పూర్తిగా నిలిపివేసేలా ఈ బిల్లు లేనేలేదన్నమాట.

## అమెరికాకు ఎందుకంత అవసరం?

రష్యాపై ఆర్థిక ఆధారపడటాన్ని తగ్గించాలని అమెరికా ప్రయత్నిస్తున్నప్పటికీ.. అణు ఇంధన రంగంలో మాత్రం మాస్కో పాత్ర ఇప్పటికీ పెద్దదే. 2025లో అమెరికా పౌర అణు విద్యుత్ సంస్థలు మొత్తం 12.71 మిలియన్ సెపరేటివ్ వర్క్ యూనిట్స్ (ఎస్‌డబ్ల్యూయూ) మేర ఎన్‌రిచ్‌మెంట్ సేవలను కొనుగోలు చేశాయి. అందులో రష్యా నుంచి వచ్చినవి 3.284 మిలియన్ ఎస్‌డబ్ల్యూయూ.. అంటే సుమారు 26 శాతం. అమెరికా దేశీయ ఎన్‌రిచ్‌మెంట్ సేవల వాటా సుమారు 23 శాతంగా ఉంది. ఫ్రాన్స్, బ్రిటన్, నెదర్లాండ్స్ కూడా అమెరికాకు ఎన్‌రిచ్‌మెంట్ సేవలు అందిస్తున్నాయి.

## యురేనియం కొంటే సరిపోదు..

అణు ఇంధనం తయారీ ప్రక్రియ ముడి చమురు లాంటిది కాదు. గనుల నుంచి తీసిన యురేనియంను నేరుగా చాలా వాణిజ్య అణు రియాక్టర్లలో ఉపయోగించలేరు. ముందుగా కన్వర్షన్, ఎన్‌రిచ్‌మెంట్ వంటి పలు దశలు దాటాలి. ఈ ఎన్‌రిచ్‌మెంట్ సామర్థ్యంలో రష్యా చాలా కాలంగా ప్రపంచంలో కీలక స్థానంలో ఉంది. అందుకే రష్యాతో విస్తృత ఆర్థిక సంబంధాలను తగ్గించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నా.. అణు విద్యుత్ రంగానికి అవసరమైన ఇంధన సరఫరాను ఒక్కసారిగా దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం అంత సులభం కాదు.

## 2024లోనే రష్యా యురేనియంపై నిషేధం

ఈ ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా.. అమెరికా 2024 మేలో రష్యా యురేనియం ఉత్పత్తుల దిగుమతులపై నిషేధం విధించింది. అయితే దేశీయ సరఫరా వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు కంపెనీలు మినహాయింపులు కోరుకునే అవకాశం కల్పించింది. ఈ మినహాయింపు వ్యవస్థ 2028 జనవరి 1 వరకు కొనసాగేందుకు అవకాశం ఉంది. అదే సమయంలో అమెరికా దేశీయ అణు ఇంధన సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు 2.72 బిలియన్ డాలర్ల నిధులను కేటాయించింది. దీని లక్ష్యం కూడా రష్యాపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడమే. అయితే రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ టారిఫ్‌లకు మార్గం వేస్తూనే.. తన అణు విద్యుత్ రంగానికి అవసరమైన కొన్ని రష్యా యురేనియం సరఫరాలకు మాత్రం మినహాయింపులు ఉంచింది. ఇలా.. ఒకే బిల్లులో అమెరికా రెండు రకాల విధానాలను అవలంబిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

## భారత్, చైనా.. టారిఫ్‌లపై సస్పెన్స్

రష్యా నుంచి ముడి చమురు, సహజవాయువు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఈ బిల్లుతో ట్రంప్‌కు దక్కింది. రష్యా ఇంధనాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలే ఈ విషయంలో ప్రభావితం కానున్నాయి. అయితే భారత్ మాత్రం రష్యా ఆయిల్ విషయంలో తగ్గేదే లేదని చెబుతోంది. జాతి ప్రయోజనాల కోసం తాము ఆలోచిస్తామని.. అదే సమయంలో ఈ టారిఫ్ ముప్పు గురించి అమెరికాతో చర్చిస్తున్నట్లు తెలిపింది. దీంతో ట్రంప్ నిర్ణయం ఏంటన్నది ఉత్కంఠగా మారింది.

# ఇవి అచ్చంగా హత్యలే!



పీడలా వెంటాడుతున్న పేదరికంనుంచి తప్పించుకుందామని... మెరుగైన జీవితాన్ని అందుకుందామని చదువుల కోసం, కోచింగ్ కోసం, చిన్నా చితకా కొలువుల కోసం దేశ రాజధాని నగరం వచ్చే లక్షలమంది యువతకు అక్కడ అడుగడుగునా మృత్యువు పొంచివుంటుందని తెలియదు. బడాయి కబుర్లుచెప్పి గద్దెలెక్కే నేతలకు ఇలాంటివేమీ పట్టవని అసలే తెలియదు. అందుకే ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కుప్పకూలిన ఢిల్లీ సత్యనికేతన్ కాలనీ పీజీ హాస్టల్‌లో ఏడుగురు యువకులు తనువు చాలించారు. శిథిలాల్లో చిక్కుకున్నవారు మమ్మల్ని కాపాడండని ఆర్తనాదాలు చేస్తున్నా అవి అరణ్యరోదనలే అయ్యాయి. ఆలస్యంగా మొదలైన సహాయక చర్యల్లో కొందరు ప్రాణాలతో బయటపడినా తీవ్ర గాయాలపాలయ్యారు. ఢిల్లీకి ఇలాంటి విషాదకర ఉదంతాలు కొత్తగాదు. గత పదేళ్లకాలంలో చూసుకున్నా వీటి సంఖ్య ఎక్కువే. మొన్నటికి మొన్న మే నెలాఖరు, జూన్ మొదటివారం మధ్య రెండుచోట్ల ఇటువంటివే చోటు చేసుకున్నాయి. అయిదంతస్తుల భవంతి కూలిన ఘటనలో ఆరుగురు మరణించగా,20 మంది గాయపడ్డారు. మరో మూడు రోజులకు ఒక హోటల్ మంటల్లో చిక్కుకుని 23 మంది మరణించారు. అక్కడ ఆరు గదులకు అనుమతి తీసుకుని ఏకంగా 26 గదులు నిర్మించి అద్దెకిచ్చారు. కుప్పకూలేందుకు సిద్ధంగా ఉండే భవంతుల్ని పోల్చుకోవటం పెద్ద కష్టం కాదు. అవేమీ బయటకు రాజమహళ్ల మాదిరిగా కనబడవు. నాచుపట్టిన గోడలతో, పెచ్చులూడిపడుతూ, కరెంటు వైర్లు వేలాడుతూ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతూ ఉంటాయి. లోపలికెళ్తే ఇరుకిరుకు గదులు, విరగడానికి సిద్ధంగా ఉండే మంచాలు, టేబుళ్లు, పెద్దగా ధ్వని చేసుకుంటూ ఎప్పుడు మీదపడతాయో తెలియని ఫ్యాన్లు దర్శనమిస్తాయి. ఎక్కడికక్కడ నల్లా గొట్టాలు చిట్లి నీళ్లు లీకవుతుంటాయి. కానీ ఓట్ల కోసం ఇల్లిల్లూ తిరిగే నాయకులకు ఇవేమీ కనబడవు. గెలిచాక అసలే పట్టవు. అధికార గణానికీ, సిబ్బందికీ ఇలాంటి భవంతులు అదనపు ఆదాయ మార్గాలు. వివిధ పట్టణాల్లో, నగరాల్లో చదువుల్లో టాపర్లుగా ఉంటూ, పోటీ పరీక్షల్ని సునాయాసంగా గెలుచుకునే పిల్లలు ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని 90 కళాశాలల్లో చేరడానికి వస్తారు. వీటిల్లో చేరే లక్షన్నరమందిలో అత్యధికులు బయటివారే. కానీ కేవలం 20 కళాశాలలకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉంది. అవి 3,000 మందికి మించి చోటిచ్చే అవకాశం ఉండదు. ఢిల్లీలో రాష్ట్ర, కేంద్ర పరిధుల్లోని యూనివర్సిటీలు, ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలు మొత్తంగా 38 ఉంటాయి. వీటిల్లో 5 లక్షలమంది విద్యార్థులుంటే ఇందులో మూడింట రెండొంతులమంది బయటివారే. దేశం బ్రహ్మాండంగా అభివృద్ధి సాధిస్తోందని గంభీరోపన్యాసాలిచ్చే వారికి ఇవేమీ కనబడవు. కనీసం నెలకు పదో పదిహేనో భవంతుల్ని తనిఖీ చేసి నివాసయోగ్యం కాని, అగ్నిప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నవాటిని గుర్తించి తక్షణం ఖాళీ చేయించేలా తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉండదు. పదే పదే చోటుచేసుకునే ఉదంతాల్ని చూశాకైనా కళ్లు తెరవాలని తోచదు. ఒకప్పుడు జనావాసంగా ఉన్న ఈ ప్రాంతంలో అనేక ప్రైవేటు హాస్టళ్లకు అనుమతించారు.

ఈ మహానగరంలో మనుగడ సాగించటానికి ఉన్నంతలో అవే దిక్కని మధ్యతరగతి, దిగువమధ్యతరగతి పిల్లలు వస్తారు. కానీ అవి సురక్షితమో కాదో, కట్టడం నాణ్యత ఏ మేరకుందో చూసే నాథుడుండడు. సొమ్ము వచ్చిపడేసరికి ఉదారంగా అనుమతులీయటం ఒక్కటే అధికారులకు తెలుసు. చిత్రమేమంటే... సాధారణ సమయాల్లో వీటిపై ఏమాత్రం శ్రద్ధపెట్టని నేతలు ఏదైనా జరిగాక పరామర్శకొస్తారు. ఇకపై ఇలాంటివి జరగబోవని ఉదారంగా హామీ ఇస్తారు. ఎన్నడో 2007లో రూపొందించిన నిబంధనల్లో ఇలాంటి భవంతుల్ని వెంటవెంటనే గుర్తించి ఖాళీ చేయించాలని ఉన్నా తమకు పట్టింపులేకపోయిందన్న సంగతి తెలియనట్టు ప్రవర్తిస్తారు. ఇంతకూ నలుగురు అధికారుల్ని సస్పెండ్ చేశామని చెప్పడం ఎవర్ని వంచించటానికి? ఇవి ప్రమాదాలు కాదు... అవినీతి, నిర్లక్ష్యం కలగలిసిన పర్యవసానంగా జరిగిన హత్యలు. ఇందుకు బాధ్యత కేవలం ఆ అధికారులదేనా? పాలకులకు జవాబుదారీతనం ఉండదా?

# నిరంకుశత్వంపై ధర్మాగ్రహం




ఒకసారంటూ జనం ఓట్లతో గద్దెనెక్కాక ఇష్టారాజ్యంగా పాలించవచ్చునని భావించే పాలకులకూ, వారి అడుగులకు మడుగులొత్తే ఉన్నతాధికారులకూ అలహాబాద్ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. అక్రమమో, సక్రమమో... ఒక కేసులో అరెస్టయ్యాక, పాలకులు తల్చుకుంటే ఎన్నాళ్లయినా చెరసాలపాలు కాకతప్పదన్న భయాందోళనలు ప్రజల్లో వ్యాపింపజేయటానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆ జాడ్యం మరింత ముదిరింది. జనాన్ని సంఘటితపరిచే వారితో కఠినంగా వ్యవహరిస్తే ఇతరులు బెదిరిపోతారనీ, అంతా 'పరిష్కారం' అవుతుందనీ ప్రభుత్వాలనుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ న్యాయస్థానాల వైఖరెలా ఉండాలో, ప్రాథమిక హక్కుల అమలుకు ఎంతగా ప్రాధాన్యమివ్వాలో జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ అచల్ సచ్‌దేవ్‌లతో కూడిన ధర్మాసనం చూపించింది. ఈ నిరసనల్లో పాల్గొన్న న్యాయశాస్త్ర విద్యార్థిని ఆకృతి చౌధరీపైనా, మరికొందరిపైనా మొన్న ఏప్రిల్‌లో జాతీయ భద్రతా చట్టాన్ని (ఎన్ఎస్ఏ) ప్రయోగించి గౌతమ్ బుద్ధనగర్ జిల్లాలోని కస్నా జైలుకు పంపారు. తగిన కారణం లేకుండా, ఏకపక్షంగా ఎన్ఎస్ఏ వంటి కఠినమైన చట్టాన్ని ప్రయోగించటంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసి, ఆమెకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలనీ, ఈ మొత్తాన్ని జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) మొదలు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి వరకూ అందరి జీతాల్లోనూ కోతబెట్టి అందించాలనీ ఆదేశించింది. కేసు పూర్వాపరాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీ కార్మికులకు రోజూ 10 నుంచి 12 గంటలు పనిచేస్తే నెలకు రూ. 10,000 నుంచి రూ. 13,000 వరకూ వేతనం లభిస్తుంది. హరియాణాలోనూ, దాని పరిధిలోకొచ్చే పొరుగునున్న గురుగ్రామ్‌లోనూ ఈ తరహా కార్మికుల కనీస వేతనాన్ని 35 శాతం పెంచి రూ. 15,000గా నిర్ధారించారు. తమకూ వేతనాలు పెంచాలనీ, అది రూ. 20,000వరకూ ఉండాలనీ నోయిడా కార్మికులు డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగారు. ఇందులో ఏం వైపరీత్యం ఉంది? వారు డిమాండ్ చేసినంతా ఇవ్వటం సాధ్యం కాకపోవచ్చు. చర్చలకు పిలిస్తే కలిగే నష్టమేమిటి? ఈ కార్మికులకు వేతనం ఒక్కటే సమస్య కాదు. నియామక పత్రాలుండవు కనుక అదనపు చాకిరీకి అదనంగా ఏమీ రాదు. వారాంతపు సెలవులుండవు. పీఎఫ్, ఆరోగ్య బీమా వంటివి లేవు. నిర్దిష్టంగా ఒక తేదీకి వేతనాలు, భద్రతా ప్రమాణాలు కనబడవు. మహిళా కార్మికుల స్థితి మరింత ఘోరం. కార్మికులకొచ్చే వేతనాల్లో కాంట్రాక్టర్ల అక్రమ కోతలు సరేసరి. 58.2 శాతం మందికి అసలు నియామక పత్రాలే లేవు. 47 శాతం మందికి వేతనంతో కూడిన సెలవు లేదు. అరకొరగానైనా రోజులు గడిచినంత కాలం ఎవరూ ప్రశ్నించలేదు. కానీ గడ్డురోజులు దాపురించాక మౌనంగా ఉండలేకపోయారు. ఇవన్నీ ప్రభుత్వ పెద్దలకు తెలియదని కాదు. అయినా ఎడాపెడా కేసులు పెట్టి జైళ్లకు పంపితే అంతా సమసిపోతుందని భావించారు. ఆకృతి తదితరులు నిరసనలో హింసకు కుట్ర పన్నారని, జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని చెప్పడానికి వాట్సాప్ మెసేజ్‌లు లేదా ఇతరత్రా ఆధారాలు చూపలేకపోయారని ధర్మాసనం వ్యాఖ్యానించటం గమనార్హం.

న్యాయమైన కోర్కెల్ని శాంతియుతంగా తెలపడానికి శాంతిభద్రతలకు విఘాతం సాకుతో అవకాశం ఇవ్వకపోవటం నిరంకుశ పాలనకు దారితీస్తుందని అభిప్రాయపడింది. విధుల్ని సక్రమంగా నిర్వర్తించే అధికారుల్నీ, పోలీసులనూ జనం దేవతలే అసూయ పడేంతగా నెత్తినపెట్టుకుంటారనీ, అక్రమ చర్యలకు పాల్పడితే అందుకు విరుద్ధమైన ఫలితాలొస్తాయనీ హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్ ఒక్కటే కాదు... పలు రాష్ట్రాల్లో పోలీసులు అధికార పార్టీకి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ నేతలనూ, కార్యకర్తలనూ, సామాజిక మాధ్యమాల బాధ్యులనూ అక్రమ కేసులతో వేధిస్తున్నారు. నెలల తరబడి జైళ్లపాలు చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఎన్నిసార్లు చీవాట్లు పెట్టినా మార్పు లేదు. కానీ ఎల్లకాలమూ ఇది సాగదు. ఇదే వరస కొనసాగితే ఏపీలోనూ కఠిన చర్యలు తీసుకునే స్థితి ఏర్పడుతుంది. అప్పుడు పాలకులూ, వారి రెడ్ బుక్‌లూ అధికారుల్ని రక్షించటం అసాధ్యం.

# రాఘవేంద్ర హైట్స్ లో శోభాయమానంగా నాలుగవ రోజు గణేష్ చతుర్థి వేడుకలు



ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్ ఉయ్యూరులోని రాఘవేంద్ర హైట్స్ అపార్ట్ మెంట్ లో గణేష్ చతుర్థి ఉత్సవాలు నాలుగవ రోజు కూడా అత్యంత ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా కొనసాగాయి.నాలుగవ రోజు పూజ సందర్భంగా భక్తులు విశేషమైన మణిదీప వర్ణన పారాయణం



నిర్వహించారు.ఈ వేడుకల్లో అపార్ట్ మెంట్ వాసులందరూ భేదాభిప్రాయాలు లేకుండా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పారాయణం అనంతరం చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఎంతో ఆనందోత్సాహాలతో చేసిన కోలాటం నృత్యం ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వేడుకల అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# 14, 065 అడుగులపై నిలిచిన క్షణం

## బియర్ స్టాట్ విజయంపై

## అంపేరాయని ఉమా కార్తీక్ (ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు)





కొలరాడో,అమెరికా శ్రీ వార్త న్యూస్ బియర్ స్టాట్ విజయం నాకు ఒక ముఖ్యమైన పాఠం నేర్పింది. శిఖరాన్ని చేరడం ఒక్క క్షణం వెనుక సద్దిత శారీరక



శ్రమ, ఓర్పు, నిర్ణయశక్తి, ప్రకృతిపట్ల గౌరవం అన్నీ ఉంటాయి. ప్రతికూల పరిస్థితుల్లో ధైర్యం అంటే ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయడం కాదు. పరిస్థితిని సరిగ్గా అంచనావేసి అవకాశం ఉన్నపుడు వివేకంతో ముందుకు సాగడం అని అంపేరాయని ఉమా కార్తీక్ పేర్కొన్నారు. ఈయన అమెరికాలో కొలరాడో రాష్ట్రంలోని బియర్ స్టాట్ పైన 14,065 అడుగులపైన నిలిచి విజయం సాధించారు. ఈయన సీనియర్ పాత్రికేయులు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు అల్లుడు. తన విజయంపై ఆయన ముచ్చటించారు. ఆ రోజు వాతావరణం కొద్దిసేపు ఇచ్చిన విరామాన్ని నా సిద్ధతతో ఉపయోగించుకో గలిగాను. శిఖరంపై నిలిచిన క్షణం నాకు ఒక విషయాన్ని మరింత బలంగా చెప్పింది. లక్ష్యం పెద్దదైనా, అడుగు మాత్రం ఒక్కటే. ఆ ఒక్క అడుగును మళ్ళీ మళ్ళీ వేస్తే గమ్యం చేరువవుతుంది. ఈ యాత్రను సాధారణ విహారయాత్ర నుంచి నా జీవితంలో చిరస్మరణీయ అనుభవంగా మార్చాయి. ఈ ప్రయాణం నాకు మరోసారి గుర్తుచేసింది. గమ్యాలు మనకు దిశ చూపిస్తాయి. పట్టుదల మనల్ని అక్కడకు చేర్చుతుందని ఉమా కార్తీక్ వివరించారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ చేయూత



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ మానవతా చేయూత అందించింది. మచిలీపట్నం 31వ డివిజన్ శారదా పేటకు చెందిన పులవర్తి సురేష్ బాబు-శ్రీలక్ష్మి దంపతుల నివాసంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లోని అధిక భాగం సామగ్రి అగ్నికి ఆహుతైంది.ఈ ఘటనపై స్పందించిన మైత్రి ఫౌండేషన్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5,000 విలువైన రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ. 3,000 నగదు సహాయాన్ని అందజేసింది.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, కోశాధికారి అనిల్, గౌరవ సభ్యులు మాణిక్యాల రావు,31వ డివిజన్ జనసేన ఇంచార్జ్ ఉడుముల బుజ్జి, స్థానికులు పాల్గొన్నారు.ధనరూపంలో సహకరించిన గౌరవ సభ్యులు ఎన్ ఆర్. ఫణి కుమార్, సత్యనారాయణ,రమేష్ బాబులకు అధ్యక్షులు వేణు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. "ఆపదలో ఉన్న కుటుంబానికి మనం అందించే చేయూత కేవలం సహాయం కాదు.. వారి జీవితంలో మళ్లీ ఆశను నింపే మానవతా స్పర్శ" అని ఆయన పేర్కొన్నారు.

# మీరు చెప్పే శ్రీరంగ నీతులు చెల్లవు.. వైసీపీ నేతలకు టీడీపీ నేతల హెచ్చరిక



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ అభివృద్ధి, సమస్యల పరిష్కారం గురించి వైసీపీ నాయకులు చెప్పే శ్రీరంగ నీతులు చెల్లవని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు.కృష్ణాజిల్లా మచిలీపట్నం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, లోగిశెట్టి వెంకట స్వామి, పిప్పళ్ల వెంకన్న, సమతా కీర్తి, దింటకూర్తి సుధాకర్, ఇలియాస్ పాషా, అబ్దుల్ అజీమ్, రాజు, బొడ్డు శ్రీను తదితరులు మాట్లాడారు.మచిలీపట్నం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్, మాజీ మంత్రి పేర్ని నాని తనయుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి రాద్ధాంతం చేయడం పద్ధతి కాదని, మున్సిపల్ అధికారులతో ఆయన ప్రవర్తించిన తీరు క్షమార్హం కాదన్నారు.మున్సిపాలిటీలో పారిశుధ్యం, కాంట్రాక్టర్లకు బిల్లులు, వర్కర్లకు జీతాల చెల్లింపు గురించి పేర్ని కిట్టు శ్రీరంగ నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు.మీ హయాంలో ఐదేళ్లపాటు మున్సిపాలిటీ నిండా అప్పులు, గోతులు మిగిల్చి వెళ్లారని, వాటిని పూడ్చుకుంటూ ప్రజా సంక్షేమాన్ని అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మచిలీపట్నం మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు,త్రాగునీటి సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు.మంత్రి కొల్లు రవీంద్ర పని విధానం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని, అభివృద్ధికి అత్యధిక నిధులు ఖర్చు చేస్తున్న మంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.మచిలీపట్నం-మంగినపూడి బీచ్ లో 63 అడుగుల మట్టి గణపతి విగ్రహం పెట్టి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంటే వైసీపీ నాయకులకు మింగుడు పడడం లేదని, అందుకే బురదజల్లే ప్రయత్నాలకు పాల్పడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

# కళాసౌధం నుంచి బియర్ స్టాట్ శిఖరాగ్రం వరకు ప్రయాణం అంపేరాయని ఉమా కార్తీక్ విజయం

డెన్వర్ నగరం, జార్జ్ టౌన్ చరిత్ర,

గ్యానెల్లా కనుమ వైభవం, ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి

బియర్ స్టాట్ శిఖరాన్ని చేరుకున్న కార్తీక్ అంపేరాయని

కొలరాడో విజయాత్ర

(ఉమా కార్తీక్ ప్రయాణ అనుభవాల కారణంగా)

(ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు.. ఆధ్యాత్మిక సేవకులు సీనియర్ పాత్రికేయులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)



అమెరికా శ్రీ వార్త న్యూస్ కొన్ని యాత్రలు కేవలం ఒక ప్రదేశాన్ని చూపిస్తాయి. మరికొన్ని యాత్రలు చరిత్రను, సంస్కృతిని, ప్రకృతిని పరిచయం చేస్తూ మనలోని ధైర్యాన్ని కూడా మనకే చూపిస్తాయి. నా అల్లుడు అంపేరాయని ఉమా కార్తీక్ ఇటీవల చేసిన ప్రయాణం అలాంటిదే ! డెన్వర్ కళా వైభవం నుంచి రాకీ పర్వతాల ఒడిలోని జార్జ్ టౌన్, గ్యానెల్లా కనుమ దాటి బియర్ స్టాట్ శిఖరాగ్రం వరకు సాగిన అతని అనుభవాలను, ఉమా కార్తీక్ చెప్పిన భావాలతోనే ఇక్కడ ఒక ప్రత్యేక వ్యాస రూపంలో అందిస్తున్నాను. ఇక నుంచి కార్తీక్ మాటల్లో ఈ ప్రయాణం.డెన్వర్ కళా సంగ్రహాలయం --ప్రపంచ కళకు విశాల వేదికడెన్వర్ లో కార్తీక్ మొదటి ముఖ్యమైన సందర్శన నగరంలోని ప్రసిద్ధ కళా సంగ్రహాలయం. 1893 లో ఆరంభమైన ఈ సంస్థలో సుమారు 70 వేల కళాఖండాలు ఉన్నాయని సంగ్రహాలయ సమాచారం చెబుతోంది. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, అమెరికా, ఓషియానియా ప్రాంతాల పురాతన. ఆధునిక కళ రూపాలు ఒకే ప్రాంగణంలో కనిపించడం దీనికి ఉన్న ప్రత్యేకత. బయట నుంచి చూస్తేనే కోణాలు, విరుపులు, ముందుకు చొచ్చుకొచ్చినట్లున్న నిర్మాణ భాగాలతో భవనం స్వయంగా ఒక కళాఖండంలా అనిపిస్తుంది. కానీ నాకు అత్యంత హృదయానికి దగ్గరైన అనుభవం ఆసియా కళా విభాగంలో ఎదురైంది. అమెరికా

మధ్యభాగంలోని ఒక కళా సంగ్రహాలయంలో భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయం ఇంత గౌరవంగా పదర్శించబడటం చూసినప్పుడు సహజంగానే ఒక అనుబంధ భావన కలిగింది. శ్రీకృష్ణుడు కాళీయ మర్దనం చేస్తున్న దృశ్యం. శ్రీ హనుమంతుడి కలప శిల్పం. శివ పార్వతుల రూప చిత్రాలు. సీతారాముల వివాహ సందర్భాన్ని ప్రతిబింబించే మిథిలా శైలీ చిత్రణ -- ఇవన్నీ మన ఇతిహాసాలు. కేవలం భారత దేశానికే పరిమితం కాకుండా ప్రపంచ కళా వారసత్వంలో భాగమే నిలిచాయని గుర్తుచేస్తున్నాయి.ప్రత్యేకంగా హనుమంతుడి శిల్పం ప్రక్కన రామాయణం అనేక శతాబ్దాలుగా దక్షిణ, ఆగ్నేయ ఆసియా సమాజాల్లో విస్తరించిన మహాకవ్య సంప్రదాయమని వివరించిన ప్రదర్శన నాకు ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. ఒక భారతీయుడిగా తెలిసిన కథలను వేల మైళ్ళ దూరంలో మరో దేశ ప్రజలు కళ, చరిత్ర మతపరమైన అధ్యాయంగా చూస్తుండటం ఈ సందర్శనకు మరింత విలువ ఇచ్చింది. బంగారు గుమ్మటంలో కొలరాడోరాష్ట్ర శాసన భవనండెన్వర్ నగరంలో మరో



ప్రధాన చారిత్రక కట్టడం కొలరాడో రాష్ట్ర శాసన భవనం. 1886 లో నిర్మాణం ప్రారంభమై 1901లో పూర్తయిన ఈ భవనంలో రాష్ట్ర సెనేట్, ప్రతినిధుల సభ, గవర్నర్ కార్యాలయం తదితర ప్రధాన పరిపాలనా వ్యవస్థలు పనిచేస్తాయి. రాష్ట్ర శాసన సభ 1894 లో తొలిసారి ఈ భవనంలో సమావేశమైంది. వాషింగ్టన్ లోని జాతీయ శాసన భవనాన్ని గుర్తుచేసి నవ శాస్త్రీయ శైలిలో నిర్మించిన ఈ కట్టడంలో అత్యంత ఆకర్షణీయ అంశం బంగారు గుమ్మటం. గుమ్మటం 1908 లో పూర్తయింది. అదే సంవత్సరంలోకొలరాడో గనికారులు అందించిన బంగారంతో దానిని అలంకరించారు. పశ్చిమ మెట్ల వద్ద సముద్రమట్టానికి ఒక మైలు ఎత్తును సూచించే గుర్తులు ఉండటం వల్ల డెన్వర్ కు వచ్చిన " ఒక మైలు ఎత్తు నగరం" అనే పేరుకు కూడా ఈ భవనం ఒక చిహ్నంగా మారింది.

### రాకీ పర్వతాల మధ్య జార్జ్ టౌన్ --- వెండి గనుల వారసత్వం

డెన్వర్ నగర జీవనం నుంచి పర్వత ప్రాంతం ప్రవేశించిన తర్వాత నా తదుపరి గమ్యం జార్జ్ టౌన్. 1859 లో గనుల శిబిరంగా ఏర్పడిన ఈ పట్టణం కొలరాడో వెండి గనుల చరిత్రలో కీలక పాత్ర పోషించింది. ఒక దశలో " కొలరాడో వెండి రాణి " అనే పేరును కూడా సంపాదించింది. విక్టోరియా కాలపు ఇళ్లు, పాత గనుల అవశేషాలు, సంరక్షించబడిన చారిత్రక భవనాలు, జార్జ్ టౌన్ వలయ రైలు మార్గం -- ఇవన్నీ నేటికి ఆ కాలాన్ని గుర్తుచేస్తాయి. 1877లో రైలు మార్గం చేరడంతో గనుల్లోని వెండి ధాతువును డెన్వర్ వైపు తరలించడం సులభమైంది. పర్వత దృశ్యాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులను కూడా ఈ ప్రాంతం ఆకర్షించడం మొదలైంది.

### గ్యానెల్లా కనుమ -- ఒకే రహదారిలో మరే పర్వత ప్రపంచం

జార్జ్ టౌన్ నుంచి పైకి ఎగసే గ్యానెల్లా కనుమ మార్గం నా ప్రయాణంలో అత్యంత అందమైన దశలో ఒకటి సుమారు 22 మైళ్ళ పొడవున్న ఈ దృశ్యరమ్య పర్వత రహదారి దిగువన ప్రూస్ ఫర్, ఆస్పెన్, పైన అడవుల మధ్య సాగి, పైకి వెళ్తున్న కొద్దీ విస్తారమైన పచ్చిక మైదానాలు, చివరకు వృక్షరేఖ దాటి సున్నితమైన ఉన్నత పర్వత మైదాన ప్రాంతానికి చేరుతుంది. కనుమ ఎత్తు సుమారు 11, 669 అడుగులు. అందుకే రాకీ పర్వతాల విభిన్న జీవావరణాలను తక్కువ దూరంలోనే అనుభవించగల అరుదైన మార్గంగా ఇది ప్రసిద్ధి చెందింది.

### వాతావరణంతో పోరాడిన రోజు --- శిఖరాగ్రంలో నిలిచిన విజయం

పర్వత యాత్ర రోజున ఉదయం గ్యానెల్లా కనుమ వద్ద నుంచి నేను పాదయాత్ర మొదలుపెట్టాను. ప్రారంభంలో ఆకాశం కొంతతెరచుకొని, పర్వత ముఖాలు స్పష్టంగా కనిపించాయి. నేను స్థిరమైన వేగంతో ముందుకు సాగాను. కానీ ఎత్తు పెరుగుతున్నకొద్దీ పరిస్థితి వేగంగా మారింది. మబ్బులు దిగువచ్చాయి. వర్షం మొదలైంది. తర్వాత మంచు గింజలు కలిసిన వర్షం, బలమైన గాలులు ఎదురైనాయి. మొదటి రెండు మైళ్లలోనే నా వెనుక నుంచి పూర్తిగా తడిసి బరువు పెరిగింది. అయినా అడుగులు ఆపకుండా,



తొందర పడకుండా, శక్తిని ఆదా చేసుకుంటూ ముందుకు సాగాను.ఆ దశలో నా శరీర సామర్థ్యం కంటే వాతావరణమే ప్రధాన సవాలుగవమరింది. గాలి వేగం, తడి, మంచు గింజలు, తగ్గిన దృశ్యమానత -- ఇవ్వన్నీ కలసి ప్రతి అడుగును పరీక్షించాయి. నేను పరిస్థితిని నిర్లక్ష్యం చేయకుండా తరచూ ఆకాశాన్ని, దారిని, నా శరీర స్థితిని అంచనా వేసుకుంటూ రక్షణ వస్త్రాలను సరిచేసుకొని, నడక కర్రలతో స్థిరంగా ముందుకు సాగాను. కొంతసేపటికి మేఘాలు పలుచబడి దారి స్పష్టంగా కనిపించిన చిన్న వాతావరణం విరామం లభించింది. ఆ అవకాశాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని చివరి రాతిబండల దశవైపు ప్రయాణం కొనసాగించాను. చివరి రాతిబండల ఎక్కింపు అత్యంత కఠినమైన దశ అప్పటికే శరీరం అలసిపోయినా, మనసు మాత్రం లక్ష్యంగా నిలిచింది. కొద్దిసేపు తెరుచుకున్న వాతావరణ విరామాన్ని ఉపయోగించుకొని ఒక్కో అడుగు జాగ్రత్తగా వేస్తూపైకి చేరుకున్నాను. చివరకు 14,065 అడుగుల ఎత్తులోని బియర్ స్టాట్ శిఖరాగ్రంపై నిలిచిన క్షణం వచ్చింది. చేతిలో శిఖర సూచిక పలకతో తీసుకున్న చిత్రం ఆ క్షణానికి గుర్తుగా మిగిలింది. అక్కడ నిలబడినప్పుడు ఆనందంతో పాటు ఉపశమనం, కృతజ్ఞత కూడా కలిశాయి. ప్రతికూల వాతావరణం నా ప్రయాణాన్ని కఠినం చేసింది గానీ, నా సంకల్పాన్ని ఆపలేకపోయింది. 14,065 అడుగులపై నిలిచిన క్షణం -- పట్టుదలకు ప్రతిఫలంబియర్ స్టాట్ నాకు విజయం గురించి ఒక ముఖ్యమైన పాఠం నేర్పింది. శిఖరాన్ని చేరడం ఒక్క క్షణం, ఆ క్షణం వెనుక సద్దిత శారీరక శ్రమ, ఓర్పు, నిర్ణయశక్తి, ప్రకృతిపట్ల గౌరవం అన్నీ ఉంటాయి. ప్రతికూల పరిస్థితుల్లో ధైర్యం అంటే ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయడం కాదు. పరిస్థితిని సరిగ్గా అంచనావేసి, అవకాశం ఉన్నపుడు వివేకంతో ముందుకు సాగడం. ఆ రోజు వాతావరణం కొద్దిసేపు ఇచ్చిన విరామాన్ని నా సిద్ధతతో ఉపయోగించుకోగలిగాను. శిఖరంపై నిలిచిన క్షణం నాకు ఒక విషయాన్ని మరింత బలంగా చెప్పింది. లక్ష్యం పెద్దదైనా, అడుగు మాత్రం ఒక్కటే. ఆ ఒక్క అడుగును మళ్ళీ మళ్ళీ వేస్తే గమ్యం చేరువవుతుంది. డెన్వర్ కళా సంగ్రహాలయంలో భారతీయ ఇతిహాసాల కళా రూపాలను చూసిన ఆత్మీయత, కొలరాడో రాష్ట్ర శాసన భవనం చరిత్ర, జార్జ్ టౌన్ వెండి గనుల వారసత్వం, గ్యానెల్లా కనుమలోని అద్భుత ప్రకృతి, చివరికి బియర్ స్టాట్ శిఖరాగ్రంపై సాధించిన విజయం -- ఇవన్నీ కలసి ఈ యాత్రను సాధారణ విహారయాత్ర నుంచి నా జీవితంలో చిరస్మరణీయ అనుభవంగా మార్చాయి. ఈ ప్రయాణం నాకు మరోసారి గుర్తుచేసింది. గమ్యాలు మనకు దిశ చూపిస్తాయి. పట్టుదల మనల్ని అక్కడకు చేర్చుతుంది.

# పేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట...బండి రామకృష్ణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఉచిత నాణ్యమైన వైద్యంతో పాటు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని జనసేన పార్టీ ఇంచార్జ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు.స్థానిక 14వ డివిజన్ కు చెందిన తాడికొండ నాగ దుర్గకు రూ. 73,850 చీఫ్ మినిస్టర్స్ రిలీఫ్ ఫండ్ చెక్కును డివిజన్ జనసేన ఇంచార్జ్ మంత్రి పృథ్వి ఆధ్వర్యంలో బండి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కునపరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సుమారు రూ. 1,722 కోట్ల ఆర్థిక సహాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించామని, 1.91 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు.14వ డివిజన్ ఇంచార్జ్ మంత్రి పృథ్వి మాట్లాడుతూ, శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం మరియు తాను ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వడ్డీ చిరంజీవి,గంపల దుర్గా భవాని, పినిశెట్టి వేణు, మణిబాబు, ఎండి సమీర్, తోట రాజేష్, చంటి, మోకా, రాంజ్యోతి, కృష్ణా మరియు 14వ డివిజన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గడ్డంరాజు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ చిలకలపూడి లక్ష్మణరావుపురం లోగణపతిని ప్రతిష్టించి నవరాత్రులు నిర్వహిస్తున్న జోడుగుడుల దేవస్థానం డైరెక్టర్ తోట పవన్ కుమార్ దంపతుల ఆహ్వానం మేరకు మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు గణపతిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు తోటపవన్ దంపతులకు కమిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా గడ్డంరాజు మాట్లాడుతూ,విఘ్నేశ్వరుడుబ్రహ్మచారిఅని సిద్ధి బుద్ధి అంటే మనం అనుకున్న కార్యాన్ని సిద్ధించుకోవడానికి తెలివితేటలు అంటే బుద్ధిఇచ్చే గణపతిని సిద్ధి బుద్ధి వినాయక అంటారని తెలిపారు.గణపతిని మనం భక్తుతో పూజించినట్లయితే మనం అనుకున్న కార్యం సిద్ధించడానికి కావలసిన మేధోశక్తి అంటే తెలివితేటలు లేక బుద్ధిని విఘ్నేశ్వరుడు ప్రసాదిస్తారని భక్తులకు అత్యంత విశ్వాసమని అన్నారు శ్రీ లక్ష్మీ గణపతి అంటే గణపతిని భక్తితో పూజించినట్లయితే అష్టలక్ష్ముల అనుగ్రహాన్ని కలిగేలా విఘ్నేశ్వరుడు అనుగ్రహిస్తారని శ్రీ లక్ష్మీ గణపతి అని కొలుస్తారని పేర్కొన్నారు. విఘ్నేశ్వరుడు బ్రహ్మచారి అని ఏదైనా కార్యం తలపెట్టేటప్పుడు తొలిగా విఘ్నేశ్వరుని పూజిస్తే ఆటంకాలు లేకుండా అనుకున్న కార్యం నెరవేరేల విగ్నేశ్వరుడు కరుణాకటాక్షాలు లభిస్తాయని భక్తులు అత్యంత విశ్వాసంతో తొలిగా విఘ్నేశ్వరుని పూజిస్తారని తెలిపారు

# అవనిగడ్డ బ్రాంచ్ లో పది నిముషాల్లో డెత్ క్లెయిమ్ పూర్తి

డాక్యుమెంట్స్ ఇచ్చిన పది నిముషాల్లో నామినీ ఖాతాకు రూ.3లక్షలు జమ





అవనిగడ్డ సెప్టెంబర్ 18 శ్రీ వార్త భీమా రంగంలో ఖాతాదారుల నమ్మకం చూరగొని తిరుగులేని విజేతగా, అగ్రగామిగా నిలిచిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ఖాతాదారుల పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. కొత్తవ్యాపారం చేయటం మాత్రమే కాకుండా క్లెయిమ్స్ పరిష్కారం లోనూ అత్యంత వేగంగా స్పందించి ప్రజల మన్ననలు అందుకుంటోంది. అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం పది నిముషాల్లో క్లెయిమ్ పరిష్కరించి నామినీ ఖాతాలో మూడు లక్షల నగదును జమచేశారు. ఘంటసాలకు చెందిన తుమ్మల జనార్ధనరావు డెత్ క్లెయిమ్ కు సంబంధించిన పత్రాలను ఎండిఆర్టీ ఏజెంట్ దిషోన్ కుమార్ శుక్రవారం కార్యాలయంలో క్లెయిమ్స్ విభాగంలో అందచేశారు. వెంటనే స్పందించిన అధికారులు ఎం.లావణ్య, బి.మౌనిక, ఎ.రాంబాబులు సంబందిత పత్రాలను పరిశీలించి పది నిముషాల్లో క్లెయిమ్ సెటిల్ చేస్తూ రూ.3లక్షల మొత్తాన్ని నామినీ ఖాతాకు పంపారు. వృత్తిపట్ల అంకితభావం, పాలసీదారుల కుటుంబ ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా అత్యంత వేగంగా స్పందించి క్లెయిమ్ పరిష్కరించటం పట్ల బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ అధికారులను అభినందించారు. ఎల్ఐసి పట్ల ప్రజల్లో నమ్మకం మరింత పెరిగే ఈ తరహా విధినిర్వహణ అభినందనీయమన్నారు.

## కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మండలి

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి పుట్టినరోజు వేడుకలు



అవనిగడ్డ సెప్టెంబర్ 18 శ్రీ వార్త మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాలశౌరి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ బాలశౌరి అపూర్వ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, మాజీ సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, జనసేన పార్టీ నాయకులు జీవీ తాతారావు, గుడివాక శివరావు, అన్నపరెడ్డి రామదాసు, గరికపాటి శ్రీనివాసరావు, రేపల్లె మాధవ, రేపల్లె పిచ్చేశ్వరరావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001